# విశాల భారతి

29-06-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

సోమవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 175




## మారని వాహనదారులు

- 12 ఏళ్లలో 8 కోట్ల చలాన్లు.. ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేకపోవడం
- రూ. 1,571 కోట్ల జరిమానాలు వసూలు కావాల్సి ఉంది
- సాంకేతికత ఉన్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదు
- చలాన్ల నుంచి తప్పించుకోవడానికి నకిలీ నంబర్ ప్లేట్లు
- బకాయిలు ఉంటే వాహన సేవలను నిలిపివేయాలి

03

## పూటకో పార్టీ మార్చేటోళ్లు మాపై మాట్లాడుతరా?



- బీఆర్ఎస్ త్వరలో 'హెచ్ఆర్ఎస్'గా మారుతుందని ఎద్దేవా
- మూసీ ప్రక్షాళనతో నల్గొండ కష్టాలు తీరనున్నాయి
- 2028 నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పూర్తి చేస్తాం
- రూ. 13 వేల కోట్లతో మౌలిక వసతుల కల్పన
- ఒక్కో ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం
- నల్గొండలో 12 స్థానాలు గెలిచి తీరుతాం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

బీఆర్ఎస్ నేతల పరిస్థితి పచ్చ కామెర్లు వచ్చిన వారిలా ఉందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. వారికి అంతా పచ్చగానే కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. రేపు ఆ పార్టీ కాస్తా హెచ్ఆర్ఎస్‌గా మారుతుందని, అంటే దాని అర్థం హరీశ్‌రావు రాష్ట్ర సమితి అని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. నల్గొండ జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా నాగార్జున డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కోమటిరెడ్డి ప్రసంగించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొడుతూ ప్రభుత్వ పనితీరును ఆయన ప్రజల్లోకి తీసుకెళ్లారు. త్వరలోనే ఉమ్మడి నల్గొండ ప్రజలకు మూసీ కష్టాలు పూర్తిగా తొలగిపోతాయని మంత్రి హామీ ఇచ్చారు. రూ.13 వేల కోట్ల వ్యయంతో 5,300 కిలోమీటర్ల మేర రోడ్లకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. ఇందిరమ్మ పాలనలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ పేద ప్రజల ముఖాల్లో సంతోషం చూస్తున్నామని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో పాలకులకు రోడ్ల దుస్థితి అస్సలు పట్టలేదని, కనీస సౌకర్యాల

మిగతా 2లో..



# ఎవరైనా అడ్డొస్తే తొక్కుతా



- అడ్డంకులు వచ్చినా పనులు ఆపేది లేదు
- మూసీని దేశంలోనే అద్భుత ప్రాజెక్టుగా మార్చడమే
- 2034 వరకు తమ ప్రభుత్వమే ఉంటుంది
- పేదలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేస్తున్నాం
- అభివృద్ధిపై బీఆర్ఎస్‌తో చర్చకు సిద్ధం
- అసెంబ్లీలో భర్తీ వివరాల వెల్లడి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మూసీ ప్రక్షాళనను ఎవరూ ఆపలేరని, అడ్డం పడే వారిని తొక్కుకుంటూనే ప్రాజెక్టును పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన ప్రకటన చేశారు. నల్గొండ ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. హైదరాబాద్ నగరానికి ఎవరు వచ్చినా మూసీ నదిని చూసి ఆశ్చర్యపోయేలా తీర్చిదిద్దుతానని, ఇది తన జీవితాశయమని ఆయన స్పష్టం చేశారు. తన రాజకీయ ప్రయాణంలో మూసీ ప్రాజెక్టు పూర్తి చేయడమే అత్యంత కీలకమైన అంశమని ఆయన పునరుద్ఘాటించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ పనులను ఆపే ప్రసక్తే లేదని, ప్రజల సమక్షంలో ఒట్టేసి చెబుతున్నానని ఆయన తేల్చి చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా మూసీ అభివృద్ధిపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను లెక్కచేయకుండా ముందుకు సాగుతామని ఆయన ప్రకటించారు. తెలంగాణ అభివృద్ధికి మూసీ ప్రక్షాళన వెన్నెముకగా నిలుస్తుందని, దేశం గర్వించేలా ఈ ప్రాజెక్టును పూర్తి చేసి చూపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ఈ ప్రాంతం పర్యాటక రంగంలో అగ్రస్థానంలో నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు వల్ల స్థానికులకు కలిగే లాభాలను వివరించిన ఆయన, ఇది కేవలం నది అభివృద్ధి మాత్రమే కాదని, లక్షలాది మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చే గొప్ప కార్యక్రమని పేర్కొన్నారు.

మిగతా 2లో..

## దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలి

- ఎన్నికలకు సిద్ధమైతే అసెంబ్లీని రద్దు చేయాలి
- రేవంత్‌పై తీవ్ర విమర్శలు
- బీఆర్ఎస్ పాలనలోనే ఎక్కువ వడ్ల సేకరణ
- రైతు పథకాలు ఎగ్గొట్టినందుకు సీఎం క్షమాపణ చెప్పాలి
- మూసీ నీరు కాళేశ్వరం ప్రాజెక్టువేనని స్పష్టం
- అభివృద్ధిని ప్రశ్నిస్తే వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారు

03



## తెలంగాణలో బీజేపీదే అధికారం

- వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుంది
- సొంత ఉద్యోగులను సీఎం నమ్మడం లేదు
- కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం కలిశాయి
- అక్రమ ఓట్లపై పారదర్శకత అవసరం
- రాష్ట్ర ప్రగతికి బీజేపీ ప్రభుత్వం కావాలి
- అధికారుల నిర్ణయాల్లో ఎంఐఎం పాత్ర ఉంది

02





## తెలంగాణ భాషను కించపరిస్తే సహించం

- 'ఇదుపు కాయితం' అంటే విడాకుల పత్రం అని అర్థం
- దీని అర్థం కోసం పవన్ కళ్యాణ్‌ను అడగాలంటూ కవిత ఎద్దేవా చేశారు
- పవన్ కళ్యాణ్ వివాహాలను ఉద్దేశించే ఈ వ్యాఖ్యలు చేశారు
- తెలంగాణ భాషను కించపరిస్తే సహించేది లేదని హెచ్చరిక
- రేవంత్, బీజేపీల తీరును కవిత తప్పుబట్టారు
- ఒక సినిమాకు ఈ పేరు పెట్టడం వల్ల వివాదం మొదలైంది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** సోషల్ మీడియా వేదికగా ప్రస్తుతం "ఇదుపు కాయితం" అనే పేరు మార్మోగుతోంది. ఒక సినిమా టైటిల్ నుంచి మొదలైన ఈ వివాదం, ఇప్పుడు రాజకీయ విమర్శలకు దారితీసింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో మాత్రమే వినిపించే ఈ పదం అర్థంపై నెటిజన్లు ఆసక్తి చూపిస్తుంటే, ఇదే పదాన్ని ఆసరాగా చేసుకుని రాజకీయ నేతలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో

మిగతా 2లో..



## సీఎం పర్యటనలో ప్రోటోకాల్ రచ్చ

- సీఎం సభ వేదికగా విభేదాలు బయటపడ్డాయి
- సీఎం ప్రత్యేకంగా పేరు ప్రస్తావించారు
- కోమటిరెడ్డి అనుచరులకు షాక్
- వేదికపైకి రాకుండా సెక్యూరిటీ అడ్డుకుంది

02

## సొంతింటి కల కలేనా?

- సొంతింటి కల సామాన్యులకు కష్టమవుతోంది
- ఎకరం రూ. 237 కోట్ల వరకు చేరిన ధరలు
- భారీ ప్రాజెక్టులతో రియల్ రంగానికి కొత్త ఊపు
- ఈ-వేలంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం
- నగరం నలుదిశలా రియల్ ఎస్టేట్ జోరు
- వేలం ధరలే ప్రామాణికంగా మార్కెట్ ధరల పెరుగుదల

03



## 2028లో మళ్లీ కేసీఆరే సీఎం

- వికారాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు
- కాంగ్రెస్ హామీలపై తీవ్ర విమర్శలు.. కేసీఆర్ పాలనకు ప్రశంసలు
- దామగుండం అడవులు, ఫిరాయింపులపై ప్రభుత్వంపై ఫైర్
- 2028లో మళ్లీ కేసీఆరే సీఎం అవుతారని ధీమా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** వికారాబాద్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం వేదికగా వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోసపోతే గోసపడుతామని మా నాయకుడు కేసీఆర్ ఎన్నికలకు ముందే హెచ్చరించారు. ఇప్పుడు రాష్ట్రంలో సరిగ్గా అదే జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ఆరోగ్యం బాగాలేకపోయినా, కార్యకర్తలపై ఉన్న ప్రేమతో వికారాబాద్ చేరుకున్నానని చెప్పారు. ఇక్కడి అద్భుతమైన ప్రకృతి, స్వచ్ఛమైన గాలి పీల్చుకుంటే రోగాలన్నీ నయమవుతాయని పేర్కొంటూ వికారాబాద్ పర్యాటక సౌందర్యాన్ని కొనియాడారు. కేసీఆర్ హయాంలో తెలంగాణ

మిగతా 3లో..



# పూటకో పార్టీ మార్చేటోళ్లు మాపై మాట్లాడుతరా?

**మొదటిపేజీ తరువాయి**

కల్పనలో నిర్లక్ష్యం వహించారని ఆయన దుయ్యబట్టారు. త్వరలో గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు. హ్యామ్ రోడ్ల నిర్మాణ విషయంలో బీఆర్ఎస్ నేతలు చేస్తున్న ఆరోపణలు పూర్తి అవాస్తవమని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. పార్టీ పేరును పూటకోసారి మార్చుకునే నైజం ఉన్న వారు, మా గురించి మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును గతంలో అడ్డుకున్నది బీఆర్ఎస్ పార్టీనే అని ఆయన గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును సవాలుగా తీసుకున్న తమ ప్రభుత్వం, 2028 ఆగస్టు నాటికి పూర్తి చేసి నల్గొండ రైతుల కలను నిజం చేసి తీరుతామని గట్టిగా చెప్పారు. అభివృద్ధికి ఆటంకాలు సృష్టించడం విపక్షాలకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన ద్వారా ఉమ్మడి నల్గొండ జిల్లాను కష్టాల నుంచి గట్టెక్కిస్తున్నామని చెప్పారు. తాము అడగక ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీని ప్రక్షాళన చేయాలని నిర్ణయం తీసుకోవడం గొప్ప పరిణామమని ప్రశంసించారు. బీఆర్ఎస్ పాలనలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కనీసం తమకు అపాయింట్‌మెంట్ ఇచ్చేందుకు కూడా వెనకాడారని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్, అంతకుముందు అధికారంలో ఉన్న కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ఈ జిల్లాకు నిధుల కేటాయింపుల్లో తీవ్ర వివక్ష చూపారని ఆయన వివరించారు. ఇప్పుడు తాము అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని చెప్పారు. నల్లగొండను కార్పొరేషన్‌గా మార్చినందుకు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా కోమటిరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు కేటాయించాలని కోరారు. ఏఎమ్మార్పీ కెనాల్ లైనింగ్ పనుల కోసం మరో రూ.500 కోట్ల నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనివల్ల ఆయకట్టు రైతులకు సాగునీటి ఇబ్బందులు తొలగిపోతాయని ఆయన వివరించారు. ప్రజా అవసరాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే స్పందిస్తుందని, అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ పడబోమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో 30 నుంచి 40 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను యుద్ధ ప్రాతిపదికన నిర్మిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆయా ఇళ్లకు ప్రభుత్వం తరపున ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. పేదలందరికీ సొంత ఇల్లు ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాలను తిరిగి గెలిపించి ముఖ్యమంత్రికి బహుమతిగా ఇస్తామని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలన పట్ల ప్రజలు ఎంతో సంతృప్తిగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న రాద్ధాంతం వారి రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం రోడ్లు వేస్తుంటే, ఎందుకు వేస్తున్నారని అడుగుతున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ప్రజా సేవ కోసమేనని వారు అర్థం చేసుకోవాలని సూచించారు. రోడ్లు, సాగునీటి ప్రాజెక్టులు బాగుంటేనే జిల్లా ఆర్థికంగా ఎదుగుతుందని, రైతులు లాభపడతారని ఆయన అన్నారు. ప్రజలకు కావాల్సిన కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత తమపై ఉందని, దానికి కట్టుబడి పని చేస్తున్నామని తెలిపారు. ప్రతిపక్షాల విమర్శలకు తమ అభివృద్ధి పనులే సమాధానమని కోమటిరెడ్డి పునరుద్ఘాటించారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, నిర్మాణాత్మకమైన సలహాలు ఇస్తే బాగుంటుందని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన కొద్ది రోజుల్లోనే ఎన్నో మార్పులు వచ్చాయని ప్రజలే గమనిస్తున్నారని అన్నారు. వ్యవస్థలను గాడిలో పెడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నామని చెప్పారు. అబద్ధపు ప్రచారాలు నమ్మే స్థితిలో ఈనాటి ప్రజలు లేరని ఆయన స్పష్టం చేశారు. నల్గొండ గడ్డపై కాంగ్రెస్ జెండా రెపరెపలాడుతుందని మంత్రి గట్టిగా విశ్వాసం వ్యక్తం చేశారు. జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. ఎంతటి ఆటంకాలు ఎదురైనా జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు అందరూ సమన్వయంతో ఉంటూ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. జిల్లాను అన్ని రంగాల్లో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టేందుకు కృషి చేస్తానని కోమటిరెడ్డి ప్రకటించారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తామని మంత్రి చెప్పారు. రాబోయే కాలంలో ఇంకా భారీ అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు. ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. రాజకీయ విభేదాలకు అతీతంగా రాష్ట్ర భవిష్యత్తు కోసం ఆలోచించాలని సూచించారు. అందరికీ ఆమోదయోగ్యమైన పాలన అందిస్తూ నవ తెలంగాణ నిర్మాణంలో అడుగులు వేస్తున్నామని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు. జిల్లా అభివృద్ధి బాటలో పరుగులు తీస్తుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# ఎవరైనా అడ్డొస్తే తొక్కుతా

**మొదటిపేజీ తరువాయి**

రాజకీయ భవిష్యత్తు గురించి మాట్లాడుకుంటే, 2034 వరకు కాంగ్రెస్ జెండానే తెలంగాణలో రెపరెపలాడుతుందని రేవంత్ ధీమా వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన విధ్వంసాన్ని, తమ రెండేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధిని పోల్చుకోవడానికి సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్ర సంపదను కాపాడటంలో తమ ప్రభుత్వం ఎంత నిబద్ధతతో ఉందో ప్రజలకు తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. అభివృద్ధిని అడ్డుకుంటూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూసే వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. తాము అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. కేసీఆర్ హయాంలో వారు తిన్న సన్నబియ్యమే నేడు పేదలకు అందజేస్తున్నామని రేవంత్ గుర్తు చేశారు. సన్నబియ్యం పంపిణీపై ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. పంపిణీ తీరుపై ఎవరికైనా సందేహం ఉంటే నేరుగా తండాలకు వెళ్లి అక్కడి ప్రజలను అడిగి తెలుసుకోవాలని సవాల్ విసిరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సన్నబియ్యం అందుతున్నాయని, దీనిని చూసి ఓర్వలేకనే రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. పేదల ఆకలి తీర్చడమే తమ లక్ష్యమని, ఇందులో ఎటువంటి అవకతవకలకు తావులేదని ఆయన స్పష్టం చేశారు. ఉద్యోగాల భర్తీ విషయంలో విపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తోసిపుచ్చారు. తమ ప్రభుత్వ హయాంలో వేల సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చామని, అర్హులైన వారికి మాత్రమే అవకాశం దక్కిందని ఆయన తెలిపారు. అసెంబ్లీకి వస్తే ఉద్యోగాల భర్తీపై ప్రతి ఒక్క వివరంతో కూడిన నివేదిక ఇస్తామని ఆయన సవాల్ విసిరారు. నిరుద్యోగులను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు పొందాలని చూస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో పారదర్శకత పాటిస్తున్నామని, ఆ విషయాన్ని డేటాతో సహా నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలు నిర్మాణాత్మకమైన విమర్శలు చేస్తే స్వీకరిస్తామని, అంతేకానీ అవాకులు చెవాకులు పేలితే సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. నల్గొండ జిల్లా వేదికగా ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు స్థానిక ప్రజల్లో ఉత్సాహాన్ని నింపాయి. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరగకుండా చూడటమే తమ బాధ్యతని, ఆ దిశగా నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గత పాలకులు వదిలేసిన సమస్యలను పరిష్కరించడానికే తమకు సమయం పడుతోందని, త్వరలోనే రాష్ట్రం సుభిక్షంగా మారుతుందని రేవంత్ వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతి పథకం ప్రజల కష్టాలను తగ్గించేలా రూపొందించామని ఆయన తెలిపారు. పరిశ్రమలు, వ్యవసాయ రంగాల్లో రాష్ట్రం కొత్త పుంతలు తొక్కుతోందని ఆయన పేర్కొన్నారు. పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలను ప్రతిపక్షాలు అడ్డుకోవడం బాధాకరమని అన్నారు. నల్గొండ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని, రైతులందరికీ భరోసా ఇస్తామని ఆయన హామీ ఇచ్చారు. గడిచిన పదేళ్లలో జరిగిన అవినీతిని, అక్రమాలను బయటపెట్టే విషయంలో వెనక్కి తగ్గేది లేదని హెచ్చరించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, దోషులు ఎంతటి వారైనా శిక్ష తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. మూసీ ప్రక్షాళన పనులను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించామని ఆయన తెలిపారు. పనులు నాణ్యంగా జరగాలని, కాలపరిమితిలోపు పూర్తి కావాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. నగరాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దడమే తన ముందున్న లక్ష్యమని, ఆ లక్ష్యసాధనలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. మూసీ నదిని అందరికీ ఆహ్లాదకరమైన ప్రాంతంగా మారుస్తామని, నగర ప్రజల చిరకాల స్వప్నాన్ని నెరవేరుస్తామని రేవంత్ పేర్కొన్నారు. నది చుట్టూ అభివృద్ధిని విస్తరించి, నగరానికి కొత్త అందాలను అద్దుతామని చెప్పారు. ప్రజల మద్దతు ఉంటే ఏ అడ్డంకి అయినా అధిగమించవచ్చునని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వంపై నమ్మకంతో ఉండాలని, రాబోయే కాలంలో మరింత మంచి పాలన అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. నల్గొండ గడ్డపై జరిగిన ఈ సభ కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపిరిని ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నాయకులు చొరవ చూపాలని ఆయన పిలుపునిచ్చారు. అపోహలను తొలగించి, వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ముగింపులో రేవంత్ రెడ్డి మాటలు తెలంగాణలో రాజకీయ వేడిని రాజేశాయి. అభివృద్ధి కోసం ఎవరిని ఎదిరించడానికైనా సిద్ధమేనన్న ఆయన ధీమా, ప్రతిపక్షాలకు సవాలుగా నిలిచింది. ప్రజా సంక్షేమం, నగరాల అభివృద్ధిలో ఎటువంటి అవరోధాలను సహించేది లేదని, తన దృఢ నిశ్చయాన్ని మరోసారి ప్రకటించారు.



# తెలంగాణ భాషను కించపరిస్తే సహించం

**మొదటిపేజీ తరువాయి**

సెటైర్లు వేసుకుంటున్నారు. ఈ పరిణామం రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ వ్యవహారంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పందించిన తీరు చర్చనీయాంశమైంది. "ఇడుపు కాయితం" అంటే అర్థం ఏమిటనే విషయంపై వస్తున్న ట్రోలింగ్‌పై కవిత ఘాటుగా స్పందించారు. ఈ పదం వెనుక ఉన్న మర్మాన్ని అర్థం చేసుకోవాలంటే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను అడగాలని ఆమె ఎద్దేవా చేశారు. ఆయనకు ఈ పదం అర్థం బాగా తెలుసని, ఆయనే కచ్చితమైన వివరణ ఇవ్వగలరని ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో రచ్చ రేపుతున్నాయి. రాజకీయ ప్రత్యర్థులను టార్గెట్ చేసే క్రమంలో ఆమె తీసుకున్న ఈ నిర్ణయం విమర్శలకు, సమర్థనలకు తావిస్తోంది. తెలంగాణ మాండలికాన్ని, సంస్కృతిని అవహేళన చేసే ప్రయత్నం చేస్తే సహించేది లేదని కవిత హెచ్చరించారు. గతంలో తమ భాషను అవమానించినందుకే ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించామని గుర్తు చేశారు. ఒకరి భాషను, సంస్కృతిని గౌరవించుకోవడం నాగరికత అని, ఇలాంటి వెకిలి ప్రయత్నాలు చేయడం తగదని ఆమె సూచించారు. తెలంగాణను, తెలంగాణ భాషను కించపరిచేలా వ్యవహరిస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆమె మండిపడ్డారు. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ వైఖరిని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. రేవంత్ రెడ్డికి తెలంగాణ ఉద్యమంతో అసలు సంబంధమే లేదని ఆమె విమర్శించారు.



అందుకే తమ భాషను అవమానిస్తున్నా ఆయన ఏమీ మాట్లాడటం లేదని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీకి దేశీయ సమస్యలే తప్ప తెలంగాణ ప్రయోజనాలు పట్టవని కవిత ఘాటుగా విమర్శించారు. ప్రాంతీయ అస్తిత్వాన్ని, భాషా గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆమె స్పష్టం చేశారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ భాషా సంస్కృతులపై జరుగుతున్న దాడులను తిప్పికొట్టాలని ఆమె పిలుపునిచ్చారు. నిజానికి "ఇడుపు కాయితం" అనేది ఒక సినిమా టైటిల్. ప్రియదర్శి, నాగదుర్గ హీరో హీరోయిన్లుగా దొండపాటి వంశీ రెడ్డి దర్శకత్వంలో ఈ మూవీ షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. దీనికి సంబంధించిన ఫస్ట్ లుక్ విడుదలైన తర్వాతే అసలు వివాదం మొదలైంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో వస్తున్న ఈ సినిమా పేరును వినగానే, అర్థం తెలియని యువత సోషల్ మీడియాలో ప్రశ్నల వర్షం కురిపించారు. టైటిల్ వినగానే క్యూరియాసిటీ పెరగడంతో ఈ పదం చర్చల్లోకి వచ్చింది. ఇడుపు కాయితం అంటే విడాకుల పత్రం అని అర్థం. భార్యాభర్తలు విడిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు పెద్దల సమక్షంలో రాసుకునే ఒప్పంద పత్రాన్ని తెలంగాణలో ఈ పేరుతో పిలుస్తుంటారు. ఇది చాలా పాత పదం కావడంతో నేటి తరం యువతకు దీని అర్థం అంతగా తెలియదు. ఈ పదం మీద తెలంగాణ, ఆంధ్రా నెటిజన్ల మధ్య సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వాదనలు జరిగాయి. ఈ చర్చలు చివరికి రాజకీయ రంగు పులుముకోవడం గమనార్హం. పవన్ కళ్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని ఉద్దేశించే కవిత ఈ వ్యాఖ్యలు చేశారని నెటిజన్లు భావిస్తున్నారు. జనసేనాని పెళ్లిళ్ల ప్రస్తావనను పరోక్షంగా తీసుకురావడం ద్వారా, ఆయనను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కవిత చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జనసేన శ్రేణుల్లో ఆగ్రహం కలిగిస్తున్నాయి. మరోవైపు బీఆర్ఎస్ మద్దతుదారులు ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తూ కౌంటర్ ఎటాక్ చేస్తున్నారు. మొత్తానికి ఒక సినిమా టైటిల్ రాజకీయ దుమారాన్ని రేపింది. పదం అర్థంపై జరుగుతున్న ట్రోలింగ్ కంటే, దాని వెనుక ఉన్న రాజకీయ కోణమే ఇప్పుడు అందరినీ ఆకర్షిస్తోంది. ఒక ప్రాంతీయ సినిమా టైటిల్, రెండు రాష్ట్రాల రాజకీయ నాయకుల మధ్య విమర్శలకు కారణంగా మారడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. పవన్ కళ్యాణ్ ప్రతిష్టను దిగజార్చేలా కవిత మాట్లాడారని జనసేన అభిమానులు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అటు రాజకీయ నాయకులు కూడా తమ వాక్చాతుర్యంతో ఈ వివాదాన్ని మరింత పెంచుతున్నారు.

భాషా సంస్కృతుల గౌరవం పేరుతో మొదలైన ఈ గొడవ, చివరికి వ్యక్తిగత దూషణల వరకు వెళ్లడం విచారకరం. రాజకీయ నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడంలో ఉన్న తప్పులేదు కానీ, ఇలాంటి పదాలను వాడుతూ సంస్కృతి గురించి మాట్లాడటం విడ్డూరమని మరికొందరు నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. ఏదైనా ఒక అంశంపై చర్చించేటప్పుడు హుందాతనాన్ని పాటించాల్సిన అవసరం ఉందని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. ఇలాంటి చిన్న చిన్న వివాదాలు పబ్లిసిటీ కోసం ఉపయోగపడినా, సమాజంలో విభజనను పెంచుతాయని వారు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా "ఇడుపు కాయితం" పేరు మీద జరుగుతున్న ఈ రచ్చ త్వరగా సద్దుమణగాలని కోరుకుందాం. రాజకీయాల్లో విమర్శలు ప్రతి విమర్శలు సహజమే అయినప్పటికీ, గౌరవప్రదమైన రీతిలో ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఒక సినిమా టైటిల్ వివాదాన్ని సామాజిక దృక్పథంతో చూస్తే అందరికీ మంచిది. రాజకీయ ప్రయోజనాల కోసం భాషను, సంస్కృతిని వాడుకోవడం మంచి పద్ధతి కాదని అందరూ గ్రహించాలి. ఇకనైనా నేతలు వివేకంతో వ్యవహరించి ఇలాంటి వివాదాలకు ముగింపు పలకాలని ఆశిద్దాం.

# సీఎం పర్యటనలో ప్రోటోకాల్ రచ్చ



- సీఎం సభ వేదికగా విభేదాలు బయటపడ్డాయి
- సీఎం ప్రత్యేకంగా పేరు ప్రస్తావించారు
- కోమటిరెడ్డి అనుచరులకు షాక్
- వేదికపైకి రాకుండా సెక్యూరిటీ అడ్డుకుంది
- అసంతృప్తితో సీఎం పర్యటనకు గైర్హాజరు
- రాజగోపాల్ రెడ్డి మద్దతుదారుల అరెస్టులతో ఉద్రిక్తత
- జిల్లా రాజకీయాలపై తన పట్టును ప్రదర్శించారు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లగొండ జిల్లా పర్యటన, బహిరంగ సభ రాజకీయంగా ఎంతటి ప్రాధాన్యత సంతరించుకున్నాయో అంతకంటే మిన్నగా అధికార కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలను, గ్రూపు రాజకీయాలను మరోసారి బట్టబయలు చేశాయి. సభకు ముందు, సభ జరుగుతున్న సమయంలో చోటుచేసుకున్న పరిణామాలు జిల్లా కాంగ్రెస్ వర్గ పోరును నివురు గప్పిన నిప్పులా వీధిలోకి తెచ్చాయి. ఒకరిపై ఒకరు పంతాలు, నెగ్గింపుల పర్వంతో నల్లగొండ రాజకీయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో పార్టీ అధికారిక కార్యక్రమాలను, సీఎం సభను దగ్గరుండి విజయవంతం చేయాల్సిన బాధ్యత డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిపై ఉంటుంది. కానీ, అక్కడ పరిస్థితులు అందుకు భిన్నంగా సాగాయి. నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేతకు ఈ పర్యటనలో అడుగడుగునా చేదు అనుభవాలే ఎదురయ్యాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వర్గానికి, కైలాష్ నేతకు మధ్య ఉన్న తీవ్రమైన గ్యాప్ కారణంగా సభ కోసం ఏర్పాటు చేసిన అధికారిక ఫ్లెక్సీలు, పత్రికా ప్రకటనల్లో డీసీసీ అధ్యక్షుడి ఫోటోగానీ, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఫోటోలుగానీ ఎక్కడా కనిపించకపోవడం తీవ్ర కలకలం రేపింది. ఒక దశలో కైలాష్ నేత సభకు రాకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేస్తారనే ప్రచారం కూడా జోరుగా సాగింది. పార్టీలో కిందిస్థాయి నుంచి ఎదిగిన నాయకుడిని ఇలా అవమానించడం జిల్లా రాజకీయాల్లో చర్చకు దారితీసింది. అయితే, వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ ఆయన తన పంతం నెగ్గించుకున్న తరహాలో నేరుగా సీఎం సభా వేదికపై ప్రత్యక్షం కావడం గమనార్హం. బహిరంగ సభా వేదికపైకి రావడం ఒకెత్తయితే, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా తన ప్రసంగంలో పున్న కైలాష్ నేత పేరును ప్రత్యేకంగా ప్రస్తావించడం రాజకీయ వర్గాల్లో ఆశ్చర్యం కలిగించింది. తనను రాజకీయంగా తొక్కేయాలని చూసిన స్థానిక వ్యతిరేక వర్గానికి కైలాష్ నేత ఈ రకంగా గట్టి సమాధానం చెప్పారని ఆయన అనుచరులు భావిస్తున్నారు. సీఎం గుర్తింపు దక్కడంతో ఆయన వర్గీయుల్లో ఉత్సాహం పెరిగింది. ఒకవైపు డీసీసీ అధ్యక్షుడు తన పట్టు నిరూపించుకుంటే, మరోవైపు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అత్యంత సన్నిహితులు, జిల్లా కేంద్రంలో కీలక నేతలుగా ఉన్న ఇద్దరు నాయకులకు సీఎం భద్రతా సిబ్బంది నుంచి ఊహించని షాక్ తగిలింది. నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి వేదికపైకి వెళ్లేందుకు ప్రయత్నించారు. కానీ, ప్రోటోకాల్, భద్రతా కారణాల దృష్ట్యా సీఎంఓ సిబ్బంది వారిని కఠినంగా అడ్డుకుని పక్కకు నెట్టివేయడం సంచలనంగా మారింది. మంత్రి కోమటిరెడ్డి అండతో జిల్లాను శాసిస్తున్న ఈ కీలక నేతలకు సీఎం వేదికపై చోటు దక్కకపోవడం వారి వ్యతిరేక వర్గంలో పెద్ద ఎత్తున హర్షానికి దారితీసింది. ఈ పర్యటనలో ముందే ఊహించిన అంశం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గైర్హాజరు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, మిగతా ఎమ్మెల్యేలందరూ సీఎం సభలో సందడి చేయగా, రాజగోపాల్ రెడ్డి మాత్రం ఎక్కడా కనిపించలేదు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో తనకు చోటు దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారనే ప్రచారానికి ఈ సభకు దూరం కావడం మరింత బలాన్ని చేకూర్చింది. సభకు ముందే రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలంటూ నిరసన తెలిపేందుకు ప్రయత్నించిన ఆయన అనుచరులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేయడం జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతకు కారణమైంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసినప్పటికీ అంతర్గతంగా నేతల మధ్య ఉన్న అహాలు, ఆధిపత్య పోరు సీఎం సభ ద్వారా మరోసారి బహిర్గతమయ్యాయి. ఒకవైపు స్థానిక మంత్రుల హవా నడుస్తుండగా, మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి నేరుగా డీసీసీ అధ్యక్షుడికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జిల్లా రాజకీయాలపై తనదైన పట్టును ప్రదర్శించే ప్రయత్నం చేశారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సీఎం మద్దతు తనకే ఉందనే సంకేతాన్ని పరోక్షంగా రేవంత్ రెడ్డి పంపడం గమనార్హం. జిల్లా పగ్గాలు ఎవరి చేతిలో ఉంటాయనే అంశంపై ఈ ఘటన ఒక స్పష్టతనిచ్చింది. సీఎం పర్యటన సక్సెస్ అయినప్పటికీ లీడర్ల మధ్య పెరిగిన ఈ గ్యాప్ రాబోయే రోజుల్లో జిల్లా కాంగ్రెస్‌ను ఎలాంటి మలుపులు తిప్పుతుందో చూడాలి. పార్టీ అధిష్టానం ఈ విభేదాలను ఎలా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నిత్యం పోటాపోటీగా ఉండే కోమటిరెడ్డి సోదరుల వర్గం, సీఎం అనుకూల వర్గాల మధ్య సమన్వయం కుదరడం ఇప్పుడు పార్టీ ముందున్న అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. క్షేత్రస్థాయి కార్యకర్తలు ఈ వర్గ పోరుతో గందరగోళానికి గురవుతున్నారు. నాయకుల మధ్య అహంకారాలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీస్తాయని పలువురు సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. నిజానికి జిల్లా రాజకీయాల్లో గ్రూపు తగాదాలు పాతవే అయినా, సీఎం సమక్షంలోనే బహిరంగంగా జరగడం చర్చనీయాంశంగా మారింది. రేవంత్ రెడ్డి పర్యటనలో వ్యూహాత్మకంగా వ్యవహరించి తన పట్టు నిరూపించుకోవాలని భావించిన కోమటిరెడ్డి వర్గానికి, భద్రతా సిబ్బంది తీరుతో చిన్నపాటి ఎదురుదెబ్బ తగిలింది. ఇది స్థానిక రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలికే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి పర్యటన ద్వారా ఎవరికి లాభం జరిగిందో ఎవరికి నష్టం కలిగిందో జిల్లా రాజకీయాల్లో అప్పుడే చర్చ మొదలైంది. గ్రూపు రాజకీయాల వల్ల అభివృద్ధి పనులు ఆగిపోకూడదని ప్రజలు ఆశిస్తున్నారు. రాజకీయాల్లో నాయకుల మధ్య పోటీ ఉండటం సహజమే కానీ, ఇలాంటి ప్రదర్శనలు కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తాయి. డీసీసీ అధ్యక్షుడికి ఇచ్చిన ప్రాధాన్యత పట్ల అధిష్టానం ఆలోచన ఏమిటో తెలియాల్సి ఉంది.

# తెలంగాణలో బీజేపీదే అధికారం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణలో జరగబోయే రాబోయే ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అఖండ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, ఆ లోటును భర్తీ చేసే శక్తి బీజేపీకి మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే సొంత ప్రభుత్వ ఉద్యోగుల మీద కూడా నమ్మకం లేనట్లుగా కనిపిస్తోందని విమర్శించారు. పరిపాలనలో పారదర్శకత లోపించి, నిరాధారమైన ఆరోపణలతో కాలం గడుపుతున్నారని ఆయన మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలుగా పనిచేస్తున్న వారు తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని ఉద్యోగులేనని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. సొంత ప్రభుత్వ ఉద్యోగుల మీదనే ముఖ్యమంత్రి తీవ్ర అనుమానాలు వ్యక్తం చేయడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. ఎన్నికల సంఘం చేపట్టిన పారదర్శకమైన ప్రక్రియపై రాజకీయ రంగు పులమడం ద్వారా ప్రభుత్వం తన అసమర్థతను కప్పుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం లేని పాలకులు ప్రజలకు ఏం న్యాయం చేస్తారని ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రహస్యంగా కుమ్మక్కయ్యాయని, ఎంఐఎంతో చేతులు కలిపి రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేస్తున్నాయని కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పాతబస్తీలోని ఓటర్ల జాబితాపై జరుగుతున్న చర్చను ప్రస్తావిస్తూ, అక్కడ అక్రమంగా బంగ్లాదేశ్, మయన్మార్ దేశస్థులకు ఓట్లు ఉన్నాయని ఆరోపించారు. స్థానిక నివాసితులైన



భారతీయులకు ఓటు హక్కు లభించకపోవడం దారుణమని, ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అని ఆయన నిలదీశారు. అక్రమంగా ఓట్లు పొందుతున్న వారిని కాపాడేందుకు ప్రభుత్వం ఎందుకు ప్రయత్నిస్తోందని ఆయన నిలదీశారు. కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సర్వే ప్రక్రియను నిర్వహిస్తోందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. పాతబస్తీతో పాటు దేశవ్యాప్తంగా ఒక్క దొంగ ఓటు కూడా ఉండకూడదనేది తమ లక్ష్యమని ఆయన వెల్లడించారు. ఓటర్ల జాబితా సవరణలో ఎవరికీ మినహాయింపు ఉండకూడదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమాలను అరికట్టడానికి ఈసీ తీసుకునే చర్యలకు తాము సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, ప్రభుత్వం ఎందుకు భయపడుతుందో చెప్పాలని కోరారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి సాధించాలంటే బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి పునరుద్ఘాటించారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే కేంద్రం నుంచి వచ్చే నిధులు సద్వినియోగమవుతాయని, రాష్ట్రం పురోగతి వైపు అడుగులు వేస్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలేనని, ప్రజల కష్టాలను పట్టించుకోకుండా తమ సొంత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి, ప్రజలను మోసం చేస్తున్న ఈ పార్టీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. హైదరాబాద్ నగర పరిపాలన దారుస్సలాం కనుసన్నల్లో సాగుతోందని కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏ అధికారి ఎక్కడ పనిచేయాలో, ఏ నిర్ణయం ఎలా జరగాలో ఎంఐఎం పార్టీ కార్యాలయంలోనే నిర్ణయిస్తున్నారని ఆయన ఆరోపించారు. అధికార కాంగ్రెస్ పార్టీ, ఎంఐఎం ఒత్తిడికి తలొగ్గి నగర ప్రయోజనాలను పణంగా పెడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగంపై ఎంఐఎం పెత్తనం చెలాయిస్తుంటే కాంగ్రెస్ నేతలు చోద్యం చూస్తున్నారని, ఇది తెలంగాణ అస్తిత్వానికే ముప్పు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల మేనిఫెస్టో పేరుతో ప్రజలకు ఎన్నో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు వాటి అమలులో విఫలమైందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని, అభివృద్ధి పనులన్నీ నిలిచిపోయాయని విమర్శించారు. ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం లేని పథకాలతో కాలక్షేపం చేస్తూ, రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే తెలంగాణలో నిజమైన ప్రజాస్వామ్య పాలన, పారదర్శకమైన పరిపాలన సాధ్యమవుతుందని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ నేతల అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కిషన్ రెడ్డి జోస్యం చెప్పారు. ప్రభుత్వాలు మారినా వ్యవస్థలు మారడం లేదని భావిస్తున్న ప్రజలకు, బీజేపీ ఒక బలమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఏమాత్రం భయం లేకుండా, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం బీజేపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను ఆయన కోరారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో బీజేపీ బలోపేతం అవుతోందని, క్షేత్రస్థాయిలో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని ఆయన గమనించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎండగట్టడంలో బీజేపీ అగ్రభాగాన ఉంటుందని, ప్రజల గొంతుకగా పోరాడుతామని ఆయన హామీ ఇచ్చారు. అక్రమ ఓట్ల తొలగింపు మొదలుకొని, ప్రభుత్వ వైఫల్యాల వరకు ప్రతి విషయాన్ని ప్రజాక్షేత్రంలో చర్చిస్తామని వెల్లడించారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పాత బస్తీలోని పరిస్థితులే ఇందుకు నిదర్శనమని కిషన్ రెడ్డి అన్నారు. చట్టం ముందు అందరూ సమానమేనని నిరూపించాల్సిన బాధ్యత సర్కారుపై ఉందని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం అక్రమాలకు వత్తాసు పలకడం మానుకోవాలని సూచించారు.

# సొంతింటి కల కలేనా?

- సొంతింటి కల సామాన్యులకు కష్టమవుతోంది
- ఎకరం రూ. 237 కోట్ల వరకు చేరిన ధరలు
- భారీ ప్రాజెక్టులతో రియల్ రంగానికి కొత్త ఊపు
- ఈ-వేలంతో ప్రభుత్వానికి భారీ ఆదాయం
- నగరం నలుదిశలా రియల్ ఎస్టేట్ జోరు
- వేలం ధరలే ప్రామాణికంగా మార్కెట్ ధరల పెరుగుదల



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగరంలో భూముల ధరలు రోజురోజుకూ సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి. ఐటీ రంగం విస్తరణ, మౌలిక వసతుల కల్పన, అంతర్జాతీయ స్థాయిలో అందుతున్న గుర్తింపు వెరసి రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపునిస్తున్నాయి. ప్రధానంగా జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హెచ్ఎండీఏ పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులు భూముల ధరలకు మరింత బలాన్నిస్తున్నాయి. మూసీ ప్రక్షాళన, మెట్రో రెండో దశ, ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు వంటి భారీ ప్రాజెక్టుల ప్రకటనలు పెట్టుబడిదారుల్లో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో మధ్యతరగతి ప్రజలు సొంతింటి కల సాకారం చేసుకోవడం సవాలుగా మారుతోంది. ప్రభుత్వ భూముల వేలంలో నమోదవుతున్న ధరలు రియల్ ఎస్టేట్ మార్కెట్ దిశను సూచిస్తున్నాయి. ఇటీవల రాయదుర్గంలో ఒక ఎకరం భూమి ఏకంగా రూ.237 కోట్ల ధరకు అమ్ముడవ్వడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ఇది కేవలం ఒక లావాదేవీ మాత్రమే కాదు, హైదరాబాద్ భూములకు ప్రపంచ స్థాయి డిమాండ్ ఉందనడానికి నిదర్శనం. కోకాపేటలో ఎకరం రూ.150 కోట్లు పలకడం కూడా ధరల పెరుగుదలకు నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, రియల్టర్లు మాత్రం క్షేత్రస్థాయిలో ఇంకా స్తబ్దత కొనసాగుతోందని, కొనుగోలుదారులు వేచి చూసే ధోరణి అవలంబిస్తున్నారని అభిప్రాయపడుతున్నారు. భారీ ధరలు పలికినా, సాధారణ విక్రయాలు ఆశించిన స్థాయిలో లేవని వారు పేర్కొంటున్నారు. నగరంలోని పాతబస్తీ ప్రాంతాల్లో సైతం భూముల ధరలు కనీవినీ ఎరుగని స్థాయికి చేరాయి. బేగంబజార్ వంటి వ్యాపార కేంద్రాల్లో ఒక గజం భూమి ధర రూ.8 లక్షల మార్కును దాటడం గమనార్హం. ఇటీవల 62 గజాల చిన్న స్థలాన్ని ఒక వ్యాపారి రూ.4.96 కోట్లకు కొనుగోలు చేయడం నగరంలో స్థలాలకు ఉన్న విపరీతమైన డిమాండ్‌ను ప్రతిబింబిస్తోంది. ఈ పరిణామాలు అధికార పార్టీ వర్గాలకు ఒక గొప్ప విషయంగా కనిపిస్తుండగా, సామాన్యుడికి మాత్రం గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాయి. నగరంలో స్థలాల లభ్యత తక్కువగా ఉండటం, డిమాండ్ రోజురోజుకూ పెరుగుతుండటంతో ధరలు నియంత్రణలో ఉండటం కష్టతరమవుతోంది. మేడిపల్లి లేఅవుట్‌లో హెచ్ఎండీఏ నిర్వహించిన మూడో విడత ఈవేలం భారీ విజయాన్ని సాధించింది. తూర్పు హైదరాబాద్ ప్రాంతంలో నివాస స్థలాలకు ఎంతటి డిమాండ్ ఉందో ఈ వేలం నిరూపించింది. అక్కడ గజం ధర ఏకంగా రూ.80 వేల వరకు పలికింది. కేవలం 68 ప్లాట్లకు బిడ్డింగ్ నిర్వహించగా, 63 ప్లాట్లు అమ్ముడయ్యాయి. తద్వారా ప్రభుత్వం రూ.120 కోట్ల ఆదాయాన్ని సమకూర్చుకుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నివాస ప్రాంతాలు విస్తరిస్తుండటంతో, తూర్పు వైపున కూడా రియల్ ఎస్టేట్ శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మధ్యతరగతి ప్రజలు కూడా ఈ ప్రాంతాల వైపు ఆసక్తి చూపుతున్నారు. మోకిలా ప్రాంతం ఇప్పుడు హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో హాట్ కేకులా మారింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, కోకాపేట నియోపోలిస్‌కు చేరువలో ఉండటంతో ఈ ప్రాంతానికి డిమాండ్ విపరీతంగా పెరిగింది. ఈ నెల 29, 30 తేదీల్లో మోకిలలో 100 ప్లాట్లకు హెచ్ఎండీఏ భారీ ఈవేలాన్ని నిర్వహిస్తోంది. ఒక్కో ప్లాట్ 300 నుంచి 500 చదరపు గజాల మధ్య ఉండటంతో, గజానికి కనిష్టంగా రూ.50 వేల ధరను నిర్ణయించారు. ఐటీ నిపుణులు, వ్యాపారవేత్తలు ఇక్కడ స్థిరపడేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రీమియం రియల్ ఎస్టేట్ హబ్‌గా ఎదుగుతున్న మోకిలా, భవిష్యత్తులో అత్యంత విలువైన ప్రాంతంగా మారనుంది. బంజారాహిల్స్‌లోని ప్రతిష్టాత్మక స్థలాల వేలంపై రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. జూలై 2న జరగనున్న వేలంలో 8.24 ఎకరాల భూములను అమ్మకానికి ఉంచారు. ఇక్కడ ఎకరానికి రూ.99 కోట్ల కనీస ధరను నిర్ణయించారు. కోకాపేట ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే, ఈ భూమి ఎకరానికి రూ.130 కోట్ల నుంచి రూ.150 కోట్ల వరకు పలకవచ్చని అంచనా వేస్తున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న భూమి తక్కువగా ఉండటంతో, వేలం ద్వారా వచ్చే ప్రతి స్థలానికి భారీ బిడ్డింగ్ జరుగుతోంది. ఈ ఆదాయం ప్రభుత్వ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చడంలో కీలక పాత్ర పోషిస్తోంది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఉన్న చిన్న చిన్న స్థలాలను కూడా ఈసారి వేలంలో చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన నగరానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లో కూడా ధరలు పెరుగుతుండటంతో, ఆ భూములకు కూడా మంచి డిమాండ్ లభిస్తుందని అధికారులు ఆశిస్తున్నారు. చిన్న ప్లాట్ల కొనుగోలుదారులు కూడా ఈ వేలంలో పాల్గొనే అవకాశం ఉండటంతో పోటీ పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం నిర్వహిస్తున్న వరుస వేలాలు ప్రభుత్వ ఖజానాకు భారీ ఆదాయాన్ని అందిస్తున్నాయి. జూలై చివరి నాటికి వేలం ద్వారా రూ.1000 కోట్లకు పైగా ఆదాయం లభిస్తుందని అంచనా వేస్తున్నారు. నగరంలో మౌలిక వసతులు, ఫ్లై ఓవర్ల నిర్మాణం ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా మారుతున్నాయి. కొత్తగా నిర్మిస్తున్న ఎలివేటెడ్ కారిడార్లు రవాణా వ్యవస్థను సులభతరం చేయడంతో, ఆ ప్రాంతాల్లోని భూములకు డిమాండ్ పుంజుకుంటోంది. రియల్ ఎస్టేట్ రంగంలో చోటుచేసుకుంటున్న ఈ మార్పులు సామాన్యులకు భారాన్ని పెంచినా, ప్రభుత్వం మాత్రం అభివృద్ధిని వేగవంతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ప్రైవేట్ డెవలపర్లు కూడా ఈ వేలం ధరలను ప్రామాణికంగా తీసుకుని తమ ప్రాజెక్టుల ధరలను పెంచే ప్రయత్నం చేస్తున్నారు. ఇది మార్కెట్‌లో ధరల పెరుగుదలకు ఒక చక్రబంధంలా మారుతోంది. హైదరాబాద్ నగరం ఐటీ కారిడార్లకే పరిమితం కాకుండా, నాలుగు దిక్కులా విస్తరిస్తోంది. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టు వల్ల శివారు ప్రాంతాల్లోని భూములకు కూడా భారీ ధరలు పలుకుతున్నాయి. పెట్టుబడిదారులు ఇప్పుడు కేవలం గజాల లెక్కన కాకుండా, ఎకరాల లెక్కన భారీగా భూములను సేకరిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు వస్తే, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయిలో మరో స్థాయికి చేరుకుంటుందనే నమ్మకంతో పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో కనిపిస్తున్న ఈ ఊపు, నగర ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది. చివరగా రియల్ ఎస్టేట్ రంగం హైదరాబాద్ వృద్ధిని సూచించే అద్దంగా నిలుస్తోంది. ధరల పెరుగుదల ఒకవైపు ఆందోళన కలిగిస్తున్నా, జరుగుతున్న అభివృద్ధి నగర భవిష్యత్తుపై అంచనాలను పెంచుతోంది. ప్రభుత్వ భూముల వేలం ద్వారా వస్తున్న ఆదాయం, మళ్ళీ ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రాజెక్టులకే వినియోగించాల్సిన బాధ్యత ఉంది. నగరం ఎంతగా విస్తరిస్తే, అంతగా ఉపాధి అవకాశాలు పెరిగి ఆర్థిక ప్రగతికి బాటలు పడతాయి. స్థిరాస్తి ధరలు సామాన్యుడికి అందేలా చూడటంలో ప్రభుత్వం ఎలాంటి విధానాలు అమలు చేస్తుందో చూడాలి. ఎదగబోయే హైదరాబాద్ అందరినీ కలుపుకుని వెళ్లడం ఎంతో ముఖ్యం.

## 2028లో మళ్లీ కేసీఆరే సీఎం

మొదటిపేజీ తరువాయి



ఏ స్థాయికి చేరుకుందో, ఇప్పుడు ఏ దుస్థితికి దిగజారిందో ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవిలో ఉండి ఒక బాధ్యతాయుతమైన వ్యక్తి అవాస్తవాలు మాట్లాడటం విచారకరం. కేసీఆర్ అప్పులు చేసిపోయారని స్పీకర్ చేస్తున్న విమర్శలకు కౌంటర్ ఇస్తూ, కేంద్ర ప్రభుత్వమే పార్లమెంటు వేదికగా లెక్కలు బయటపెట్టిందని గుర్తుచేశారు. ఆ అప్పుల ద్వారా కాళేశ్వరం వంటి బృహత్తర ప్రాజెక్టులు, మెడికల్ కాలేజీలు, గురుకులాలు నిర్మించామని, ప్రజలకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామని ఆయన వివరించారు. తెలంగాణను వెలుగుల్లోకి తెచ్చిన ఘనత కేసీఆర్‌ది అయితే, ఇప్పుడు రాష్ట్రంలో మళ్లీ కరెంట్ కోతలు, యూరియా కొరత మొదలైందని కేటీఆర్ మండిపడ్డారు. స్పీకర్ గౌరవం తగ్గించేలా రాజకీయ వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన హితవు పలికారు. రెండు లక్షల రుణమాఫీ, కౌలు రైతులు, కూలీలకు ఆర్థిక సాయం అంటూ కాంగ్రెస్ అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకుంది. ఎన్నికల ముందు రైతు బంధు ఎందుకు బంద్ అవుతుందని ప్రశ్నించిన వారు, ఇప్పుడు సమాధానం చెప్పలేకపోతున్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ఊదరగొట్టిన కాంగ్రెస్, రెండున్నర ఏళ్లు గడిచినా ఒక్క హామీని కూడా పూర్తిగా నెరవేర్చలేదు. ఈ ప్రభుత్వం చేస్తున్న అపరాధాలను, దగాకోరు రాజకీయాలను ప్రజలు నిశితంగా గమనిస్తున్నారు. తొందరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం కావడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా బీఆర్ఎస్ నాయకులు భయపడే ప్రసక్తే లేదని కేటీఆర్ తేల్చి చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు తమ వృత్తి ధర్మాన్ని పాటించాలి తప్ప అధికార పార్టీకి తొత్తులుగా మారవద్దని కేటీఆర్ హెచ్చరించారు. భవిష్యత్తులో తాము అధికారంలోకి వచ్చాక, అతి చేసిన అధికారుల చిట్టా మొత్తం రాసి పెట్టుకుంటామని హెచ్చరించారు. మీరు చేసే ప్రతి తప్పును వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుందని తీవ్ర స్వరంతో స్పష్టం చేశారు. అక్రమ కేసులు, వేధింపులకు పాల్పడుతున్న వారు పరిణామాలు అనుభవించక తప్పదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అధికారులు చట్టబద్ధంగా పనిచేయాలే తప్ప రాజకీయ నాయకుల కనుసన్నల్లో మెదలడం విజ్ఞత అనిపించుకోదని ఆయన సూచించారు. దామగుండం అడవుల పరిరక్షణ విషయంలో రేవంత్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు పట్ల కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో నేవీ రాడార్ కేంద్రం కోసం భూములు ఇవ్వడానికి కేసీఆర్ నిరాకరించారు, ఎందుకంటే 12 లక్షల చెట్లు నరికివేతకు గురవుతాయన్న ఆందోళన అప్పుడు ఉండేది. కానీ ఇప్పుడు రేవంత్ రెడ్డి కేంద్రంలోని బీజేపీ పెద్దలకు భయపడి, సుమారు 2900 ఎకరాల అడవిని ధారపోశారు. ఒకవైపు మూసీని బాగు చేస్తామని చెబుతూనే, మరోవైపు మూసీ పురిటిగడ్డ అయిన అనంతగిరి కొండల్లో పర్యావరణాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు కలిసి మూసీ నదికి ఉరి వేస్తున్నాయని ఆరోపించారు. పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా వికారాబాద్ పరిధిలోని 10 వేల ఎకరాలకు నీళ్లు అందించాలనేది కేసీఆర్ సంకల్పం. అందులో 90 శాతం పనులు పూర్తయిన తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే అభివృద్ధి పనులన్నింటినీ పక్కన పెట్టారని కేటీఆర్ ధ్వజమెత్తారు. ప్రజలకు నీటి కష్టాలను మళ్లీ తెచ్చిపెట్టడం దారుణమని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం అభివృద్ధిని కుంటుపరిచేలా, రైతులను ఇబ్బందులకు గురిచేసేలా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టుల పునరుద్ధరణపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆయన విమర్శించారు. ఫిరాయింపుల వ్యవహారంపై స్పందిస్తూ అసెంబ్లీ స్పీకర్ ధృతరాష్ట్రుడిలా మౌనంగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారి కాంగ్రెస్ కండువాలు కప్పుకుని బహిరంగంగా తిరుగుతున్నా, అధికారికంగా చర్యలు తీసుకునే ప్రయత్నం చేయడం లేదని విమర్శించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించకపోవడం రాజ్యాంగ విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులు రాష్ట్రంలోని భూములను కబ్జా చేస్తున్నారని, రియల్ ఎస్టేట్ మాఫియాతో చేతులు కలిపారని ఆరోపించారు.

## దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలి

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం దమ్మున్నా వెంటనే అసెంబ్లీని రద్దు చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. ఆదివారం సిద్దిపేటలో జరిగిన పర్యటనలో ఆయన సీఎం రేవంత్ తీరుపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు. రేవంత్ కేవలం గుంపు మేస్త్రీ మాత్రమే కాదు, ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్న ముంపు మేస్త్రీ అని ఆయన ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అనాలోచిత నిర్ణయాలు, రైతుల పట్ల అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయంగా గెలుస్తామనే నమ్మకం ఉంటే, అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసరడం రాష్ట్ర రాజకీయాల్లో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రైతుబంధు పథకంపై అసెంబ్లీలో బహిరంగ చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. ప్రభుత్వం ఎన్ని పద్ధతుల్లో రైతులను మోసం చేసిందో, ఎంతటి మొత్తంలో రైతుబంధు నిధులను ఎగ్గొట్టిందో చెప్పడానికి తాను ఆధారాలతో సిద్ధంగా ఉన్నానని హరీశ్ రావు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో రైతులకు అందిన సంక్షేమ పథకాలు నేడు గాలికి వదిలేశారని ఆయన మండిపడ్డారు. మాటల గారడీతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ నాయకులు క్షేత్రస్థాయిలో రైతుల కష్టాలను పట్టించుకోవడం లేదని, వారి అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయని ఆయన హెచ్చరించారు. ధాన్యం సేకరణ విషయంలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న గొప్పలను ఆయన తూర్పారబట్టారు. రాష్ట్రంలో 80 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోందని, కానీ బీఆర్ఎస్ హయాంలో 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని రేవంత్ ప్రభుత్వం ఎందుకు మర్చిపోయిందని ప్రశ్నించారు. రైతుల నుండి వడ్లను సేకరించడంలో ప్రభుత్వం చూపిస్తున్న జాప్యం వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మద్దతు ధర విషయంలోనూ, కొనుగోలు కేంద్రాల నిర్వహణలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుబంధు నిధులను ఎగ్గొట్టినందుకు, రైతు బీమా పథకాన్ని నిలిపివేసినందుకు రైతులందరికీ రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన విమర్శించారు. హామీలను అమలు చేయాలని ప్రజలు, ప్రతిపక్షాలు ప్రశ్నిస్తుంటే, సీఎం తన అసమర్థతను దాచుకోవడానికి ప్రతిపక్షాలపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని హరీశ్ రావు ఫైర్ అయ్యారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నించే హక్కును కూడా కాలరాస్తున్న రేవంత్ రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని ఆయన హెచ్చరించారు. మూసీ ప్రక్షాళన గురించి మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు చురకలు అంటించారు. ఆ నదిలో ప్రవహించే నీళ్లు మల్లన్న సాగర్, కాళేశ్వరం వంటి బృహత్తర ప్రాజెక్టుల ద్వారా వచ్చినవేనని ఆయన గుర్తు చేశారు. ముందుగా ఉన్న జల వనరులను కాపాడుకోలేని దుస్థితిలో ఉండి, ప్రక్షాళన పేరుతో ఆర్భాటాలు చేయడం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. మూసీ సుందరీకరణ వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని, అందులో దాగున్న అక్రమాలపై చర్చకు సిద్ధపడాలని ఆయన సవాల్ విసిరారు. అభివృద్ధి అంటే ప్రజలకు మేలు చేసే పనులు చేయడమే తప్ప, కేవలం ప్రచార ఆర్భాటాలు కాదని హితవు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి అహంకారంతో మాట్లాడుతున్నారని ఆయన దుయ్యబట్టారు. తాను చేసే పనుల కంటే, ప్రతిపక్ష నేతలను విమర్శించడానికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు. నిద్రలో కూడా కేసీఆర్ పేరే కలవరిస్తున్న సీఎంకు పాలనపై ఏమాత్రం శ్రద్ధ లేదని హరీశ్ రావు విమర్శించారు. కేసీఆర్ దార్శనికతతో నిర్మించిన ప్రాజెక్టుల వల్లే నేడు రాష్ట్రం పచ్చగా ఉందనే వాస్తవాన్ని రేవంత్ రెడ్డి గ్రహించాలని, రాజకీయ ద్వేషంతో ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అహంకారపూరిత మాటలతో గడిపే సమయాన్ని రైతులకు, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలపై వెచ్చిస్తే బాగుంటుందని ఆయన సూచించారు ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రం వెనకబడిపోతోందని హరీశ్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఏ పథకం పట్టుకున్నా గందరగోళం నెలకొంటుందని, పాలనలో సమన్వయం లోపించిందని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అమలు చేసిన పథకాలు నేడు నిర్వీర్యమవుతున్నాయని, వాటిని తిరిగి గాడిలో పెట్టాల్సిన బాధ్యత తమపై ఉందని ఆయన చెప్పారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా గత ప్రభుత్వం పనిచేస్తే, నేడు సంక్షేమాన్ని తుంగలో తొక్కి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తుందని ఆయన ఆరోపణలు చేశారు. ఈ విధానాల వల్ల భవిష్యత్తులో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. గడ్డపై నుండి తాను చేస్తున్న వ్యాఖ్యలు కేవలం రాజకీయ విమర్శలు కాదని, ప్రజల ఆకాంక్షలని ఆయన స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతలుగా ప్రజల తరపున గళం ఎత్తాల్సిన బాధ్యత తమకు ఉందని, దాన్ని సక్రమంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్న పార్టీగా, బాధ్యత గల ప్రతిపక్షంగా ప్రభుత్వం చేసే తప్పులను ఎండగడతామని ఆయన హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, ఎంతటి బెదిరింపులకు పాల్పడినా వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ప్రజల అండదండలతోనే తాము తిరిగి పుంజుకుంటామని, తప్పు చేసిన పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఏ పథకానికి ఎన్ని నిధులు వచ్చాయి, ఎక్కడెక్కడ వైఫల్యాలు జరిగాయి అనే అంశాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న హామీలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయని, వాటిని ప్రజల వద్దకు తీసుకెళ్లి వాస్తవాలు వివరించాలని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకుంటూ అబద్ధపు ప్రచారాలు చేస్తున్న ప్రభుత్వాన్ని ప్రశ్నించే ధైర్యం అందరికీ ఉండాలని, అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సాధ్యమవుతుందని హరీశ్ రావు అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. గెలుపోటములు రాజకీయాల్లో సహజమని, కానీ ప్రజల సంక్షేమాన్ని పణంగా పెట్టి రాజకీయం చేయడం తగదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన తప్పులను సరిదిద్దుకుని, రైతుల పట్ల, ప్రజల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని, బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలో పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హరీశ్ రావు హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాము ఏ క్షణమైనా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## మారని వాహనదారులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్ నగర రోడ్లపై ట్రాఫిక్ ఉల్లంఘనలు నేడు అత్యంత ఆందోళనకరంగా మారుతున్నాయి. తలకు హెల్మెట్ ఉండదు, మెడను ఒక వైపు వంచి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం సర్వసాధారణమైపోయింది. దానికి తోడు ఓవర్ స్పీడ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి పద్ధతులు ప్రాణాలను పణంగా పెడుతున్నాయి. ట్రాఫిక్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తూ కొరఢా ఝుళిపిస్తున్నా వాహనదారుల వైఖరిలో మాత్రం ఏమాత్రం మార్పు రావడం లేదు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో గణాంకాలను పరిశీలిస్తే, సుమారు 40 శాతం ఓవర్ స్పీడ్ కేసులు, మరో 30 శాతం హెల్మెట్ లేని ఉల్లంఘనలే నమోదవుతున్నాయి. ఈ రెండు కమిషనరేట్ల పరిధిలో గత 12 ఏళ్లలో 8 కోట్లకు పైగా ట్రాఫిక్ చలాన్లు రికార్డవ్వడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ఏటా సగటున 70 లక్షల చలాన్లు నమోదవుతుండగా, ఇందులో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులవే ఉంటున్నాయి. నగరంలో ఔటర్ రింగ్ రోడ్, ఫ్లైఓవర్లతో పాటు జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో కూడా కొందరు అతివేగంతో దూసుకువస్తున్నారు. దీంతో వేల సంఖ్యలో ఈచలాన్లు వెల్లువలా వచ్చి చేరుతున్నాయి. ద్విచక్ర వాహనదారుల్లో హెల్మెట్ ధరించకపోవడం, ఫోర్ వీలర్స్ డ్రైవర్లు సీట్‌బెల్ట్ పెట్టుకోకపోవడం వంటివి ప్రధాన సమస్యలుగా మారాయి. సిగ్నల్ జంపింగ్, రాంగ్ పార్కింగ్, డ్రైవింగ్ సమయంలో ఫోన్ మాట్లాడటం వంటివి కూడా రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయి. ఎన్ని నిబంధనలు ఉన్నా వాహనదారుల నిర్లక్ష్యం రోడ్డు ప్రమాదాలకు దారితీస్తూనే ఉంది. ఒకే వాహనంపై పదుల సంఖ్యలో చలాన్లు పెండింగ్‌లో ఉంటున్నాయి. కొందరు జరిమానా చెల్లించకుండానే అదే వాహనంతో యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నారు. దీంతో చలాన్ కేవలం కాగితాలకే పరిమితం అవుతోంది తప్ప, ప్రవర్తనలో మార్పు తీసుకురావడంలో విఫలమవుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. హైదరాబాద్ నగరంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్, వేల సంఖ్యలో సీసీ కెమెరాలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత పర్యవేక్షణ వంటి అత్యాధునిక వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. ఉల్లంఘన జరిగిన కొద్ది నిమిషాల్లోనే వాహన యజమాని ఫోన్‌కు సమాచారం అందుతున్నా, నిబంధనలు పాటించాలనే బాధ్యత మాత్రం పెరగడం లేదు. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఏటేటా ట్రాఫిక్ చలాన్లు పెరుగుతూనే ఉన్నాయి. గడిచిన 12 ఏళ్లలో హైదరాబాద్, సైబరాబాద్ పరిధిలో సుమారు 8 కోట్ల చలాన్లు పడ్డాయి. నెలకు సగటున ఆరు లక్షల కేసులు నమోదవుతున్నాయి. ఈ కాలంలో మొత్తం రూ. 3,288 కోట్ల మేర జరిమానాలు విధిస్తే, అందులో రూ. 1,717 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. ఇంకా రూ. 1,571 కోట్ల మేర బకాయిలు వసూలు కావాల్సి ఉంది. సాంకేతికత పెరగడంతో కేసులు బుక్ అవుతున్నా, యజమానుల నుంచి పెనాల్టీ వసూలు చేయడం పోలీసులకు సవాలుగా మారింది. వాహనదారుల బ్యాంకు ఖాతాల నుంచి ఆటోమేటిక్‌గా డబ్బులు కట్ చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఆ విధానం అమలు నిలిచిపోయింది. ప్రస్తుతం హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో వాహనాల సంఖ్య కోటి దాటింది. ఏటా పెరుగుతున్న వాహనాలతో ట్రాఫిక్ ఒత్తిడి తీవ్రమవుతోంది. ఉల్లంఘనలు కూడా ఆ స్థాయిలోనే పెరుగుతున్నాయి. చలాన్లు పడకుండా తప్పించుకోవడానికి కొందరు సరికొత్త టెక్నిక్‌లు వాడుతున్నారు. నెంబర్ ప్లేట్‌ను మడత పెట్టడం పాత పద్ధతి కాగా, ఇప్పుడు బోగస్ నెంబర్ ప్లేట్‌లు తగిలించడం మొదలైంది. హైడ్రాలిక్ సిస్టం ద్వారా సెకన్లలో నెంబర్ ప్లేట్ మార్చేస్తున్న టెక్నాలజీని కూడా లగ్జరీ కార్ల యజమానులు వాడుతున్నట్లు గుర్తించారు. ఇటువంటి ప్రాక్టికల్ ఇబ్బందుల వల్ల యజమాని అడ్రస్ కనిపెట్టడం పోలీసులకు గగనంగా మారింది. ప్రభుత్వం పరివాహన్ పోర్టల్‌లో ప్రతి ఒక్కరూ మొబైల్ నెంబర్, ఈమెయిల్ అప్‌డేట్ చేసుకోవాలని నిబంధనలు పెట్టింది. పోస్టు ద్వారా చలాన్లను పంపడం కన్నా డిజిటల్ పద్ధతిలోనే చేరవేయాలని నిర్ణయించింది. అయినా కూడా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై అవగాహన కల్పిస్తున్నా, కఠిన చర్యలు తీసుకుంటున్నా వాహనదారుల్లో మార్పు రావడం లేదని ట్రాఫిక్ రంగ నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా సంభవిస్తున్న రోడ్డు ప్రమాదాల్లో ఓవర్ స్పీడ్, హెల్మెట్ లేని డ్రైవింగే ప్రధాన కారణమని తేలినా, నిర్లక్ష్యం మాత్రం తొలగడం లేదు. జరిమానా చెల్లించకపోయినా పెద్దగా ఇబ్బంది ఉండదన్న భావన ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. తరచూ ప్రభుత్వం ప్రకటించే డిస్కౌంట్ పథకాలు కూడా వాహనదారుల నిర్లక్ష్యానికి ఆజ్యం పోస్తున్నాయి. ట్రాఫిక్ చలాన్ అనేది ఆదాయ వనరు మాత్రమే కాదు, అది మోటారు వాహన చట్టం అమలులో భాగమని పోలీసులు ఎంత మొత్తుకుంటున్నా ఫలితం లేదు. కొందరిపై పదుల సంఖ్యలో పెండింగ్ చలాన్లు ఉన్నా, రోడ్లపై తిరిగేందుకు ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో బాధ్యతారాహిత్యం పెరుగుతోంది. ఈ నిర్లక్ష్యపు ధోరణిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అదనపు ఆదాయ వనరుల కోసం చూస్తున్న ప్రభుత్వానికి, వసూలు కాని రూ. 1,571 కోట్ల చలాన్ బకాయిలు పెద్ద సమస్యగా మారాయి. ట్రాఫిక్ చలాన్‌ను వాహన యాజమాన్యంతో అనుసంధానం చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పెండింగ్ జరిమానాలు ఉన్న వాహనాలకు రిజిస్ట్రేషన్ రెన్యువల్, ఫిట్‌నెస్, యాజమాన్య బదిలీ, ఇన్సూరెన్స్ క్లెయిమ్ వంటి సేవలను నిలిపివేయడం మంచిదని భావిస్తున్నారు. ఇటువంటి కఠిన చర్యలు తీసుకుంటేనే వాహనదారుల్లో చట్టం పట్ల గౌరవం పెరుగుతుంది. లేనిపక్షంలో పెండింగ్ కేసుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. నిత్యం గమనిస్తే రోజుకు సగటున 18 వేలకు పైగా చలాన్లు నమోదవుతున్నాయి. ఒక మెట్రో సిటీగా హైదరాబాద్ ఎదుగుతున్నా, పౌరుల ట్రాఫిక్ క్రమశిక్షణ మాత్రం ఇంకా బాల్య దశలోనే ఉందని చెప్పాలి. టెక్నాలజీ ఎంత పెరిగినా, సీసీ కెమెరాలు ఎన్ని వచ్చినా, వ్యక్తిగత బాధ్యత లేకపోతే వ్యవస్థ విఫలమవుతుంది. ప్రతి వాహనదారుడు తన ప్రాణం, ఎదుటివారి భద్రత తన చేతుల్లోనే ఉందని గుర్తించాలి. కేవలం చలాన్ల భయంతో కాకుండా, బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించగలం. ముగింపులో భాగంగా, ట్రాఫిక్ వ్యవస్థలో మార్పు రావాలంటే కేవలం జరిమానాల పెంపు మాత్రమే సరిపోదు. వాహనదారుల ప్రవర్తనలో మార్పు రావాలి. ప్రభుత్వం తీసుకునే కఠిన చర్యలు, ప్రజల సహకారం కలిసినప్పుడే రోడ్లు సురక్షితంగా మారుతాయి. పెండింగ్‌లో ఉన్న వేల కోట్ల చలాన్లను వసూలు చేయడానికి ప్రభుత్వం మరింత పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలి. నిబంధనలను అతిక్రమిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని తెలియజెప్పేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అప్పుడే నగర రోడ్లపై ప్రయాణం ప్రశాంతంగా, సురక్షితంగా సాగుతుంది.

## హిమాయత్ సాగర్ వద్ద గేటు ఎత్తి నీటి విడుదల



**రాజేంద్రనగర్, విశాలభారతి :** వర్షాకాల ప్రభావంతో హిమాయత్ సాగర్ జలాశయం నిండుకుండలా మారిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యగా ఈరోజు ఒక గేటును ఎత్తివేశారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. జలాశయంలో నీటి మట్టం పెరుగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తమై గేటు ఎత్తివేతకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. అధికారులు దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అవసరమైతే మరిన్ని గేట్లు కూడా ఎత్తివేయనున్నట్లు తెలిపారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ తగిన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, స్థానిక నాయకులు, హెచ్ఎండబ్ల్యూఎస్ అధికారులు, పత్రికా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు

- ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు
- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** తొర్రూర్ డివిజన్ పరిధిలోని కమ్మగూడ గ్రామపంచాయతీలో నిర్వహించిన జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ మున్సిపాలిటీ మాజీ 22వ వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, జీహెచ్ఎంసీ తొర్రూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొశికె ఐలయ్య పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొశికె ఐలయ్య మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా వారి ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామి కావాలని, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా చూసుకోవాలని విజ్ఞప్తి చేశారు. "రెండు చుక్కలు... ప్రతి చిన్నారికి – ఆరోగ్యవంతమైన భారతదేశానికి అనే సందేశాన్ని ప్రతి కుటుంబం ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుపై దాడి ఖండించిన జర్నలిస్టులు

- దోషులను కఠినంగా శిక్షించాలి




**బోడుప్పల్, విశాలభారతి:** ప్రజా సమస్యలపై నిత్యం పోరాడుతూ, అధికారులకు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సేవ చేసే విలేకరులపై దాడులు చేయడం దారుణం , మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ అంబేద్కర్ నగర్‌లో జర్నలిస్టు విష్ణుపై మూకుమ్మడిగా దాడి చేయడం, అతని ఇంటిపై రాళ్లు రువ్వడం, కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేయడం, వాహనాలను ధ్వంసం చేయడం దారుణమని జర్నలిస్టులు అందరూ కలిసి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అలాగే దోషులను కఠినంగా శిక్షించి జర్నలిస్టు విష్ణు కు న్యాయం చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో మొగుల్ల జీవన్ కుమార్ రెడ్డి

- చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి పోషకాహారంపై ఆరా



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 4వ వార్డు సభ్యుడు మొగుళ్ళ జీవన్ కుమార్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న పోషకాహారం గురించి అంగన్‌వాడీ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారంతో పాటు పల్స్ పోలియో కార్యక్రమం కూడా ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మంగుభాయ్, ఆశా వర్కర్ శుభాషిణి, స్థానికులు, తల్లిదండ్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## దీనబంధు కాలనీలో పల్స్ పోలియో

- 415 మంది చిన్నారులకు పోలియో చుక్కలు
- కాలనీ అధ్యక్షులు మహేందర్ నాయక్ ప్రశంసలు



**కూకట్ పల్లి, విశాలభారతి:** దీనబంధు కాలనీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో మొత్తం 415 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం ద్వారా మరోసారి చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కాలనీ ప్రజలు తమ బాధ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమాన్ని టీమ్ లీడర్ ఎం. కరుణ సమర్థవంతంగా ముందుండి నిర్వహించగా, సి.హెచ్. సబిత, బి. రాజేశ్వరి, సుశీలమ్మలు ఎంతో నిబద్ధతతో పనిచేసి ప్రతి అర్హత కలిగిన చిన్నారికి పోలియో చుక్కలు అందేలా కృషి చేశారు. ఈ సందర్భంగా దీనబంధు కాలనీ అధ్యక్షులు మహేందర్ నాయక్ మాట్లాడుతూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు మరియు తమ పిల్లలను తీసుకువచ్చిన తల్లిదండ్రులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. "పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. 415 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం కాలనీవాసుల అవగాహనకు, ఆరోగ్యంపై ఉన్న శ్రద్ధకు నిదర్శనమని ఆయన అన్నారు. ఇలాంటి ప్రజారోగ్య కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "ప్రతి చిన్నారి ఆరోగ్యమే దేశ భవిష్యత్తు – ప్రతి పోలియో చుక్క ఒక సురక్షిత జీవితానికి భరోసా" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పరిధిలోని కుంట్లూర్ రాజీవ్ గృహకల్పలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గ్యారల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్యారల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. జననం నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని పరిరక్షించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డును వెంటనే విరమించుకోవాలి

- క్యామ మల్లేష్ యాదవ్
- చలో కలెక్టరేట్ ముట్టడికి సంపూర్ణ మద్దతు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



భువనగిరి నియోజకవర్గ పరిధిలోని బండరావిరాల గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 268లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఎకో టౌన్' (డంపింగ్ యార్డు) ప్రాజెక్టును వెంటనే విరమించుకోవాలని భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ క్యామ మల్లేష్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 29న నిర్వహించనున్న 'చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమానికి ఆయన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు క్యామ మల్లేష్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా చేపట్టనున్న ప్రజా ఉద్యమానికి పూర్తి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం క్యామ మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పణంగా పెడుతూ పచ్చని గ్రామాల మధ్య హైదరాబాద్ నగర వ్యర్థాలను తరలించే ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా, స్థానిక ప్రజల ఆమోదం లేకుండానే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆరోపించారు. ప్రజాపాలన పేరుతో అధికారంలో ఉన్న ప్రభుత్వం ఈ సమస్యపై ప్రజల ఆందోళనలను పూర్తిగా విస్మరించిందని, ముఖ్యమంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజల పక్షాన స్పందించకపోవడం బాధాకరమని విమర్శించారు. బండరావిరాల, చిన్నరావిరాల, జగత్‌పల్లి, పెద్దగూడెం, పిగ్లిపూర్, దేశ్‌ముఖి, కావాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర గ్రామాల ప్రజల జీవనోపాధి, ఆరోగ్యంతో చెలగాటం ఆడితే సహించబోమని హెచ్చరించారు. డంపింగ్ యార్డు ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 29 ఉదయం 10 గంటలకు నిర్వహించే 'చలో కలెక్టరేట్' ముట్టడి కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా ప్రజలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని క్యామ మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. ఈ ప్రజా ఉద్యమంలో తాను స్వయంగా పాల్గొని ప్రజల తరపున పోరాడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు మొలుగు దానేశ్, కావాడి దయాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ దూస శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కందికంటి అనూష-ప్రవీణ్, కన్నె భరత్ యాదవ్, యువ నాయకులు ఏమ్ముల శివశంకర్, కొత్త శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి



- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడొద్దు
- ప్రభుత్వం నిర్ణయం వెనక్కి తీసుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**అబ్దుల్లాపూర్‌మెట్, విశాలభారతి :**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 268లో ఉన్న 494 ఎకరాల ప్రభుత్వ భూమిలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదించిన ఏకో టౌన్ డంపింగ్ యార్డ్ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రజావ్యతిరేక ప్రాజెక్టును నిరసిస్తూ నేడు (సోమవారం) రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి మద్దతు కోరుతూ బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, టీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు చేస్తున్న న్యాయమైన ఉద్యమానికి తాము పూర్తిస్థాయిలో అండగా ఉంటామని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ తరహాలో ప్రమాదకరమైన చెత్త డంపింగ్ యార్డును 'ఏకో టౌన్' పేరుతో తీసుకువచ్చి బండరావిరాల, చిన్నరావిరాల, పిల్లాయిపల్లి, బాచారం, గౌరెల్లి, సద్దుపల్లి, తారామతిపేట్, కవాడిపల్లి, బలిజగూడ తదితర దాదాపు 15 గ్రామాల పర్యావరణాన్ని కలుషితం చేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఇక్కడ అందుబాటులో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిలో ఐటీ, సాఫ్ట్‌వేర్ లేదా హార్డ్‌వేర్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించి ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని సూచించారు. అలాంటి అభివృద్ధి కార్యక్రమాల స్థానంలో ప్రజల ఆరోగ్యాలను ప్రమాదంలోకి నెట్టే చెత్త డంపింగ్ యార్డును ఏర్పాటు చేయాలనుకోవడం వెనుక కొందరి స్వార్థ ప్రయోజనాలు ఉన్నాయని విమర్శించారు. ఇప్పటికే మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టు పేరుతో మర్రిపల్లి, కుత్బుల్లాపూర్, బాచారం గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారని, ఇప్పుడు ఏకో టౌన్ పేరుతో మరిన్ని గ్రామాల ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, జనావాసాలకు దూరంగా ఉన్న అటవీ ప్రాంతంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తుగ్లక్ నిర్ణయాలకు నిరసనగా టీఆర్ఎస్, బీఎస్పీ మరియు ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నేడు ఉదయం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బండరావిరాలతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, యువత, మహిళలు మరియు నల్లగొండ జిల్లా సరిహద్దు గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్ గౌడ్, బండరావిరాల గ్రామ సర్పంచ్ కందికంటి విజయ్ కుమార్, సీనియర్ నాయకులు ములుగు దానేష్, కబాడీ దయాకర్ రెడ్డి, ఉపసర్పంచ్ శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు కందికంటి అనూష, ప్రవీణ్, కన్నె భరత్ యాదవ్, యువ నాయకులు ఎమ్ముల శివశంకర్, కొత్త శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్‌తో రైతుల మధ్య రక్తపాతం

- పబ్లిక్ రహదారి రిజిస్ట్రేషన్ వివాదం.. ఇద్దరు రైతులపై దాడి
- తహసీల్దార్ నిర్లక్ష్యమే ఘర్షణకు కారణం: బాధిత రైతుల ఆరోపణ
- ప్రజా రహదారిపై అక్రమ రిజిస్ట్రేషన్
- కలెక్టర్ విచారణకు రైతుల డిమాండ్
- రహదారి వివాదం రగిల్చిన ఘర్షణ.. ఇద్దరికి తీవ్ర గాయాలు
- అధికారుల తప్పుడు నివేదికలతో రైతుల్లో వివాదం.. దాడి ఘటన కలకలం
- అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: వీరిశెట్టి ఉపేందర్
- దశాబ్దాల నాటి ప్రజా రహదారిపై వివాదం.. రైతుల మధ్య ఉద్రిక్తత
- అధికార దుర్వినియోగంతో రైతుల మధ్య ఘర్షణ
- న్యాయం కోసం బాధితుల పోరాటం
- పబ్లిక్ రహదారి ఆక్రమణ వివాదం
- రైతులపై రాళ్ల దాడి, అధికారులపై ఆరోపణలు

**మహబూబాబాద్ సీరోల్ విశాల భారతి:**



తేది: 01-09-2025.

శ్రీయుత గౌరవనీయులైన మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గారికి నమస్కరించి వ్రాయునది ఏమనగా,

ఆర్యా..

విషయం: చెరువు నుండి రైతుల పంట పొలాలకు నీరు వచ్చే చెరువు బంధం కాలువను ఆక్రమించి అక్రమ రిజిస్ట్రేషన్ జరిపిన వారిపై చర్యల కోసం వినతి.

-0-0-

నేను, వీరశెట్టి ఉపేందర్ (ఉప్పయ్య) S/o వెంకటయ్య, వయస్సు 42 సంవత్సరాలు, కులం మున్నూరుకాపు, వృత్తి ఉద్యోగం, గ్రామం కొత్తూరు (C), మండలం సీరోల్, జిల్లా మహబూబాబాద్ నివాసిని.

నా వినమ్ర మనవి ఏమనగా, నా భూమికి పక్కన గల గెట్టుకు చెందిన యానాల లక్ష్మమ్మ (భర్త నాగయ్య) గారి భూమి, సర్వే నంబర్ 43/D/1/2 లో, గత నెలలో జలగం సుభద్ర (భర్త వెంకన్న) గారి పేరుమీద నాలా కన్వర్షన్ కింద రిజిస్ట్రేషన్ చేయబడింది.

కానీ, వాస్తవానికి యానాల లక్ష్మమ్మ మరియు వీరశెట్టి వెంకటయ్య (తండ్రి బుచ్చయ్య) గార్ల గెట్టు మధ్యలోనుండి సుమారు 6 అడుగుల వెడల్పు, 50 మీటర్ల పొడవు కలిగిన చెరువు బంధం కాలువ ఉంది. ఈ కాలువ ద్వారా పూర్వం నుండి రైతుల పొలాలకు సాగునీరు అందుతోంది.

అయితే, యానాల లక్ష్మమ్మ భర్త నాగయ్య గారు ఈ చెరువు బంధం కాలువను తన భూమిలో కలుపుకొని అక్రమంగా ఆక్రమించి, జలగం సుభద్ర గారికి విక్రయించారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రెవిన్యూ అధికారులు సరైన సర్వే చేయకపోగా, ప్రక్కన ఉన్న రైతులను సంప్రదించకపోగా, భూభారతి నిబంధనలకు విరుద్ధంగా అక్రమ రిజిస్ట్రేషన్ నిర్వహించారు.

అందువల్ల, మీ వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి, పూర్వకాలం నుండి రైతుల సాగునీటి కోసం ఉన్న ఈ చెరువు బంధం కాలువను రక్షించి, అక్రమంగా నిర్వహించిన ఈ రిజిస్ట్రేషన్‌ను తక్షణమే రద్దు చేయించి, సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవలసిందిగా వినమ్రంగా ప్రార్థిస్తున్నాను.

జతపరచినవి: భూభారతి రిజిస్ట్రేషన్ కాపీ

COLLECTOR OFFICE
01 SEP 2025
MAHABUBABAD DISTRICT.

మీ విధేయుడు
01/09/20
వీరశెట్టి ఉపేందర్ (ఉప్పయ్య),
గ్రామం కొత్తూరు (C),
మండలం సీరోలు
ఫోన్: 9182057328.

మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం కొత్తూరు (సి) గ్రామంలో దశాబ్దాలుగా రైతులు వ్యవసాయ అవసరాల కోసం వినియోగిస్తున్న సుమారు నాలుగు గుంటల పబ్లిక్ రహదారిని అక్రమంగా ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ చేయడంతో రైతుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు రైతులు గాయపడగా, అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని బాధితులు ఆరోపించారు. బాధిత రైతుల కథనం ప్రకారం, గ్రామ నక్షలో పబ్లిక్ రహదారి లేదంటూ తప్పుడు నివేదికలు సమర్పించి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ మండల తహసీల్దార్ ఇతరుల పేరున రిజిస్ట్రేషన్ జరిగేలా సహకరించారని ఆరోపించారు. ఈ అంశంపై సంబంధిత సర్వే నంబర్లతో జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవో ఇచ్చిన ఆదేశాలను కూడా పట్టించుకోలేదని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం మేరకు ఉపాధి హామీ పథకం నిధులతో పలుమార్లు రహదారి విస్తరణ పనులు చేపట్టినా, అదే రహదారి గ్రామ నక్షలో లేదని అధికారులు నివేదిక ఇవ్వడంతో రైతుల మధ్య వివాదాలు తీవ్ర రూపం దాల్చాయని తెలిపారు. ఈ వివాదం నేపథ్యంలో ఆదివారం యానాల నాగయ్య, కొత్త హరీష్ కలిసి వీరిశెట్టి వెంకటయ్య (78), వీరిశెట్టి ఉపేందర్‌లపై రాళ్లతో దాడి చేశారని, ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై సీరోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు చేసినట్లు వీరిశెట్టి ఉపేందర్ వెల్లడించారు. ఈ మొత్తం వ్యవహారంపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి, అక్రమ రిజిస్ట్రేషన్‌ను వెంటనే రద్దు చేయాలని, పబ్లిక్ రహదారిని రైతుల వినియోగానికి అందుబాటులోకి తీసుకురావాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వీరిశెట్టి ఉపేందర్ డిమాండ్ చేశారు. బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభం నితిన్ నబీన్



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని శంషాబాద్‌లో రంగారెడ్డి జిల్లా భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయ ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ హాజరయ్యారు. సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పూల వర్షంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర రావు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొని ముఖ్య అతిథిని సన్మానించారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కార్యాలయం ప్రారంభానికి జాతీయ నాయకత్వం విచ్చేయడం తమకు ఎంతో గౌరవంగా, అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నూతన బీజేపీ కార్యాలయాలను వర్చువల్ ద్వారా ప్రారంభించారు. ముఖ్య అతిథి నితిన్ నబీన్ మాట్లాడుతూ కేంద్ర నాయకత్వం రాష్ట్ర సంస్థాగత నిర్మాణానికి ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పర్యటనతో కార్యకర్తల్లో మరింత ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేస్తే తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏర్పాటు అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా స్థాయి ముఖ్య నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

## హైదర్ షాకోట్ డివిజన్లో పల్స్ పోలియో

**పాల్గొన్న భారత రాష్ట్ర సమితి బండ్లగూడ జాగీర్ వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి**




**విశాలభారతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** బండ్లగూడ జాగిర్ పరిధిలోని "హైదర్ షాకోట్ డివిజన్ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బండ్లగూడ జాగిర్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాక అధ్యక్షులు రవీందర్ రెడ్డి, మాట్లాడుతూ.. చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి పూర్తిగా రక్షించడంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. దేశం పోలియో రహిత హోదాను శాశ్వతంగా కొనసాగించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో అవగాహన పెంపొందించి ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్‌లో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి




**విశాలభారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని తొర్రూర్ గ్రామంలో రంగా నాయకులగుట్ట వాసులు నిర్వహించిన రంగా నాయకులగుట్ట ప్రీమియర్ లీగ్ (RPL) క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌కు హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన టాస్ వేసి ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ...యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలు అలవడతాయని అన్నారు. గ్రామీణ స్థాయిలో ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే వేదికలుగా ఈ తరహా టోర్నమెంట్లు నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం టోర్నమెంట్ నిర్వాహకులను, పాల్గొన్న క్రీడాకారులను అభినందించిన ఆయన, పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, టోర్నమెంట్ నిర్వాహకుడు తొండ వెంకటేష్, స్థానిక నాయకులు, క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**పసుమాముల గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహణ**



**విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ :** నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ డివిజన్ పసుమాముల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులను పోలియో మహమ్మారి నుంచి పూర్తిగా రక్షించడంలో పల్స్ పోలియో కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి తల్లిదండ్రి భాగస్వామ్యం ఎంతో అవసరమని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. దేశం పోలియో రహిత హోదాను శాశ్వతంగా కొనసాగించాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంట్లో అవగాహన పెంపొందించి ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలకు దూరం కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కర్మలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ

**చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** ఎల్‌బీ నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ముద్దగౌని రామ్‌మోహన్ గౌడ్ తండ్రి, దివంగత ముద్దగౌని యాదయ్య గౌడ్ దశదిన కర్మ కార్యక్రమం ఇంజాపూర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డాక్టర్ వీరమల్లు రామ్ నరసింహ గౌడ్ పాల్గొన్నారు. వారు దివంగత యాదయ్య గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముద్దగౌని రామ్‌మోహన్ గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. దివంగత యాదయ్య గౌడ్ సమాజానికి అందించిన సేవలను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, స్థానిక ప్రముఖులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విజయ సంకల్ప సమ్మేళనానికి ర్యాలీ

**బీజేపి అధ్యకలు సాయి ప్రసాద్ గౌడ్**



**సికింద్రాబాద్, విశాలభారతి:** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న "విజయ సంకల్ప సమ్మేళనం" సభకు బౌద్ధనగర్ డివిజన్ నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలోతరలివెళ్లారు.ఆదివారం మధ్యాహ్నం అంబర్ నగర్ గాంధీ విగ్రహం వద్ద నుండి పోలింగ్ బూత్ల నుండి కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో ర్యాలీగా వినడం జరిగిందని సాయిప్రసాద్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ...... జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పిలుపు మేరకు బౌద్ధనగర్ డివిజన్ నుండి సీనియర్ నాయకులు, అన్ని మోర్చాల అధ్యక్షులు, బూత్ అధ్యక్షులు, బి ఎల్ ఏ 2లు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, కార్యకర్తలు తరలి వచ్చారు. తెలంగాణలో బీజేపీ విజయ సంకల్పానికి ఇదే నిదర్శనం. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికలలో బౌద్ధనగర్ డివిజన్ నుండి పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తాం" అని సాయి ప్రసాద్ గౌడ్ అన్నారు. ర్యాలీలో... మాజీ కార్పొరేటర్ స్వరూప గౌడ్. రవి ప్రసాద్ గౌడ్, సత్యనారాయణ, అరవింద్, కొమరయ్య, వి ఎస్ రాజు ,నాగరాజు, సుబ్బారావు, బిక్షపతి, జయంత్, అశోక్,కవిత, బి.సత్యనారాయణ, కుమార్,నర్సింగ్, అగుల్ల శీను, గజరాజు ,పాల్ వెంకటేష్,రాజు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ విజయసంకల్ప సమ్మేళనంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారతీయ జనతా పార్టీ నిర్వహించిన బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనం ఘనంగా జరిగింది. బీజేపీ రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సమ్మేళనానికి రాష్ట్రవ్యాప్తంగా బూత్ అధ్యక్షులు, పార్టీ కీలక కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ఎన్నికల వ్యూహాలు, బూత్ స్థాయి నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. పార్టీ నాయకులు కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ విజయసాధనకు అనుసరించాల్సిన కార్యాచరణపై మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ రాబోయే ఎన్నికల్లో విజయసంకల్పంతో ముందుకు సాగాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళ్లెం నవజీవన్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి విజయసంకల్పాన్ని వ్యక్తం చేసి, పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# నిండు జీవితానికి రెండు చుక్కలు

**కౌన్సిలర్ విజయలక్ష్మి**



**మొయినాబాద్, విశాలభారతి:** "నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదంతో నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు కార్యాలయంలో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కౌన్సిలర్ పల్లగొల్ల విజయలక్ష్మి అశోక్ యాదవ్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు. చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం ప్రభుత్వం చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు మరియు చిన్నారులు పాల్గొన్నారు.

# బండ్లగూడ జాగిర్ లో పల్స్ పోలియో కార్యక్రమం



**విశాలభారతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండల్ జిహెచ్ఎంసి 121 122 123 డివిజన్స్ లలో నేడు జూన్ 28 పల్స్ పోలియో. ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ట ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి రెండు చుక్కలు తప్పనిసరి, ఇంటింటికీ సేవలు అందించనున్న ఆరోగ్య సిబ్బంది, మరియు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వేణు గౌడ్ మరియు ఏ బ్లాక్ అధ్యక్షులు డప్పు నవీన్ మరియు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్ మరియు బీసీ సెల్ అధ్యక్షులు అంకం శ్రీనివాస్ మరియు ఎంపీటీసీ భోగాల శ్రీనివాస్ తదితరులు పాల్గొనడం జరిగింది. పోలియో రహిత తెలంగాణే ప్రభుత్వ లక్ష్యం.

# తాటి చెట్టు నుంచి జారి కిందపడ్డ కల్లు గీత కార్మికుడు



**ఆత్మకూరు, విశాలాభారతి:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం మోదుబాయి గూడెం గ్రామంలో ఆదివారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన బీసు యాదయ్య (60) తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు జారి కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన యాదయ్యకు సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ప్రాథమిక చికిత్స అందించి భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయాన్ని 108 పైలెట్ ఏలేందర్, ఈఎంటీ మల్లయ్య తెలిపారు.

# ఆలేరు నియోజకవర్గంలో పల్స్ పోలియో విజయవంతం

**ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలే లక్ష్యం**

**ఆలేరు, విశాలాభారతి:**



ఆలేరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఆదివారం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తూ, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఆలేరు పట్టణం 1వ వార్డులో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఇంకా చుక్కలు వేయించని తల్లిదండ్రులు వెంటనే సమీప పల్స్ పోలియో కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. బసంతాపురం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మెండు రత్నమాల సత్తిరెడ్డి, ఉపసర్పంచ్ గుల్లపల్లి రాజుగౌడ్, మెండు భాస్కర్ రెడ్డి, వార్డు సభ్యులు ఉపేందర్ రెడ్డి, కవిత బాలకృష్ణగౌడ్, ముల్కలపల్లి రమేష్, వడ్లకొండ రాములమ్మ, వడ్లకొండ మాధవి సురేష్, వాలంటీర్ ముల్కలపల్లి సౌజన్య, మండల వైద్యాధికారి, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గోలనుకొండ గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమాన్ని మండల తహసీల్దార్ ఆంజనేయులు ప్రారంభించారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ మానస, ఏఎన్ఎం కవితారెడ్డి, ఆశా వర్కర్ సువర్ణ పాల్గొన్నారు. షారాజిపేట గ్రామంలో గ్రామ సర్పంచ్ కంతి మధు మాట్లాడుతూ, "నిండు జీవితానికి రెండు చుక్కలు" అనే నినాదాన్ని ప్రతి తల్లిదండ్రి గుర్తుంచుకోవాలని, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ హైమావతి, ఉపసర్పంచ్ శ్రీధర్, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రజాప్రతినిధులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేశారు. ఐదేళ్లలోపు ఒక్క చిన్నారి కూడా మిగిలిపోకుండా పోలియో చుక్కలు వేయించాలని అధికారులు పిలుపునిచ్చారు.

# మాధవి నగర్‌లో ఎన్యూమరేషన్ కార్యక్రమం



**రాజేంద్రనగర్, విశాలభారతి :**

మాధవి నగర్ కాలనీలో ఈరోజు నిర్వహించిన ఎన్యుమరేషన్ ఫారమ్‌ల పంపిణీ మరియు అవగాహన కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా పూర్తయింది. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, సరైన వివరాలను సేకరించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉదయం ప్రారంభమై సాయంత్రం 4:30 గంటల వరకు కొనసాగింది. కాలనీకి చెందిన మహిళలు, యువకులు, వృద్ధులు సహా అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమంలో పాల్గొన్నారు. నిర్వాహకులు ఏర్పాటు చేసిన కౌంటర్ల వద్ద ప్రజలు వరుసగా నిలబడి ఎన్యుమరేషన్ ఫారమ్‌లను స్వీకరించి, వాటిని ఎలా నింపాలో సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రజలకు ఎన్యుమరేషన్ ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించారు. సరైన సమాచారాన్ని అందించడం ద్వారా భవిష్యత్తులో ప్రభుత్వం అందించే పథకాలు, సేవలు సులభంగా పొందవచ్చని తెలిపారు. అలాగే ఫారమ్‌లు నింపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, తప్పులేని సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. కాలనీ సభ్యులు కార్యక్రమానికి చురుకుగా స్పందించి, క్రమశిక్షణతో పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఎటువంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు స్వచ్ఛందంగా సహాయం చేసిన యువతకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కాలనీ సభ్యుల సహకారం ఎంతో ముఖ్యమైందని నిర్వాహకులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రజా ప్రయోజన కార్యక్రమాల్లో అందరూ పాల్గొని సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాన్ని బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ సర్కిల్ ప్రధాన కార్యదర్శి రాముడు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమం విజయవంతం కావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# బీఆర్ఎస్ పార్టీ అమరులకు అండగా ఉంటది



- తెలంగాణ సమాజం ఉన్నంతవరకు ఆయన కుటుంబానికి మేము అండగా ఉంటాం
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు
- యాదిరెడ్డి, కరం చంద్ కుటుంబాలను పరామర్శించిన కేటీఆర్

**మొయినాబాద్ విశాలభారతి:**

మొదటినుంచి తెలంగాణ ఉద్యమంలో అనేకమంది అసువులు బాసిన అమరుల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ రుణపడి, వారికి అండగా ఉంటుందని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ కొరకు ఆత్మబలిదానం చేసుకున్న రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం పెద్దమంగళారం గ్రామానికి చెందిన యాదిరెడ్డి కుటుంబాన్ని కేటీఆర్ ఆదివారం సాయంత్రం పరామర్శించారు. అదేవిధంగా యాదిరెడ్డి తల్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. యాదిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకురాగా అయినా సానుకూలంగా స్పందించారు. అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రం కోసం అశువులు బాసిన యాదిరెడ్డి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఆర్థిక సహాయం, 500 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చినట్లు గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన కుటుంబాలకు కేసిఆర్ గారి ఆధ్వర్యంలోని బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచిందని చెప్పారు. యాదిరెడ్డి తల్లి ఆరోగ్య సమస్యల పరిష్కారానికి పార్టీ కృషిచేస్తుందని తెలిపారు. అలాగే ఇటీవల మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి గ్రామానికి చెందిన కరం చంద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి మృతి చెందడంతో కరం చంద్ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. పార్టీ తమ కుటుంబానికి అండగా ఉంటుందని కరం చంద్ భరోసానిచ్చారు. ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా ఆదుకుంటుందని తెలిపారు. కేటీఆర్ వెంట మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర నాయకులు దేశమల్ల ఆంజనేయులు, కొంపల్లి అనంత రెడ్డి, కోట్ల నరోత్తం రెడ్డి, కొత్త నరసింహారెడ్డి, ముదిగొండ రవి యాదవ్, సుధాకర్ యాదవ్, మోర శ్రీనివాస్, మోహన్ రెడ్డి, పాటి ప్రసాద్ రెడ్డి,పరమేష్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

# గంధంగూడలో భారీ స్పందన

**గంధంగూడ 200+ మందికి సర్ ఫారాల పంపిణీ**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** గంధంగూడలో విజయవంతంగా ముగిసిన సర్ 2026 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ శిబిరం గంధంగూడ, బతుకమ్మకుంట (స్ట్రీట్ 1, కేకే నగర్ 1)లో కేకే నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈరోజు (ఆదివారం) నిర్వహించిన సార్ 2026 హెల్ప్ డెస్క్ – ఒరిజినల్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ శిబిరం విజయవంతంగా ముగిసింది. ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో గంధంగూడ పోలింగ్ స్టేషన్ పరిధిలోని 127 నుండి 135 వరకు బూత్‌లకు చెందిన బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓఎస్) మరియు ఎం.ఆర్.ఓ (ఎమ్మార్వో) కార్యాలయ ఇన్‌చార్జ్ పాల్గొన్నారు. వారు ఓటర్లకు అవసరమైన మార్గదర్శకాలను అందిస్తూ ఒరిజినల్ సార్ 2026 ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేశారు. ఫారాల పంపిణీ ప్రక్రియ సజావుగా సాగేందుకు అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేసింది. ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకుంటూ 200 పైగా ఓటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఓటరికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే ఓటర్లకు సేవలందించేందుకు బిఎల్ఓ లను డిప్యూట్ చేసిన ఎం.ఆర్.ఓ గారికి ప్రత్యేక ధన్యవాదాలు," అని తెలిపారు. అదేవిధంగా, ఓటర్ల పోలింగ్ బూత్ వివరాలను గుర్తించడంలో సహకరించిన కేకే నగర్ 1 కాలనీ కార్యవర్గ సభ్యులు లుక్మాన్ భాయ్, కిషోర్, గిరిబాబు, కిష్టారెడ్డి కాలనీ మరియు శాంతి ఎస్టేట్స్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు, ఆల్ కాలనీస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ వినయ్ రెడ్డి, స్థానిక నాయకులు రావులకోళ్ల నాగరాజు, అంకం శ్రీనివాస్, డప్పు నవీన్, అలాగే ఓటర్లు మరియు రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# అభ్యుదయ నగర్‌లో పల్స్ పోలియో శిబిరం

**550 మంది చిన్నారులకు చుక్కలు**



**రాజేంద్రనగర్, విశాలభారతి :** అభ్యుదయ నగర్ కాలనీలో పల్స్ పోలియో శిబిరం ఘనంగా నిర్వహించబడింది. తెలంగాణ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల సుమారు 550 మంది చిన్నారులకు ఓరల్ పోలియో చుక్కలు వేయడం జరిగింది. ఈ శిబిరం ద్వారా చిన్నారులను పోలియో వంటి ప్రమాదకర వ్యాధి నుంచి రక్షించేందుకు ముఖ్యమైన చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమానికి బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్, హైదర్‌షాకోట్ ప్రాంతాలకు చెందిన ఏసీఫ్ సభ్యులు పూర్తి మద్దతు అందించారు. వారి సహకారంతో శిబిరం సజావుగా కొనసాగింది. వైద్య సిబ్బంది మరియు ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, సరస్వతి, బబిత ఎంతో నిబద్ధతతో టీకాల కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతి చిన్నారికి చుక్కలు అందేలా చూసారు. శిబిరానికి హాజరుకాని చిన్నారులను కూడా టీకాల పరిరక్షణలోకి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. వచ్చే రెండు రోజుల పాటు ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి, టీకాలు వేయించని పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ చర్యతో ఒక్క చిన్నారి కూడా టీకా మిస్ కాకుండా చూసే ప్రయత్నం జరుగుతోంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో పోలియోపై అవగాహన మరింత పెరిగింది. తల్లిదండ్రులు తమ పిల్లలను సమయానికి టీకాలు వేయించుకోవడం ఎంత ముఖ్యమో అర్థం చేసుకున్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ కలిసి ఇలాంటి ఆరోగ్య కార్యక్రమాలకు మద్దతు ఇస్తే, పోలియో రహిత సమాజం సాధ్యమవుతుందని నిర్వాహకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

# నల్లపోచమ్మ మొదటి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**నార్సింగి అంగన్వాడి సెంటర్లో పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న మాజీ కౌన్సిలర్ ఉషారాణి**

**విశాలభారతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి:** కిస్మత్ పూర్ లోని ఇందిరమ్మ కాలనీలో శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ దేవాలయంలో మొదటి వార్షికోత్సవం కార్యక్రమం గత మూడు రోజులుగా మాజీ కార్పొరేటర్ గోకరి శ్రీలత సురేష్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది చివరి రోజు చండీ హోమము కుంకుమార్చన అన్నప్రసాదం కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాజీ మేయర్ మహేందర్ గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ రాందాస్ ముదిరాజ్ మాజీ కార్పొరేటర్ సాగర్ గౌడ్ నాయకులు పాపయ్య యాదవ్ మాధవరెడ్డి జగదీష్ గౌడ్ భీమార్జున్ రెడ్డి అర్జున్ గౌడ్ సుమన్ హరీష్ మరియు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగింది వివిధ కాలనీలకు చెందిన మహిళలు పాల్గొని అమ్మవారి పూజలు అర్చనలు చేయడం జరిగింది.

# చిన్నారులకు చుక్కలు వేసిన డా. వీరన్న నాయక్

- పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు
- నిరుపేద కుటుంబానికి 25 కేజీల బియ్యంతో ఆర్థిక సాయం

**కురవి విశాలభారతి:**

పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో టీపీసీసీ డాక్టర్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి డా. వీరన్న నాయక్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదివారం కురవి మండలంలోని మోదుగులగూడెం గ్రామం, జుజూరు తండా గ్రామ పంచాయతీ, అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తూ ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం మోదుగులగూడెం గ్రామంలో తన తండ్రి గోపా నాయక్ జ్ఞాపకార్థంగా ఎస్.కె. సైదులు కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటానని డా. వీరన్న నాయక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోదుగులగూడెం సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్, అయ్యగారిపల్లి సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న, జుజూరు తండా సర్పంచ్ బానోత్ శిరీష, ఉపసర్పంచ్ దయ్యాల శ్రీధర్ గౌడ్, ఉపసర్పంచ్ ధారావత్ శరత్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మోదుగులగూడెం అధ్యక్షుడు కోడి రాములు, అయ్యగారిపల్లి అధ్యక్షుడు దొంగల జనార్దన్ రెడ్డి, ఏఎన్ఎం కుమారి దేవి, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, యువ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# వరుణిడి కరుణ కోసం ప్రత్యేక పూజలు

**వానలు పడేందుకు కప్ప తల్లి ఆటలు**

**ఆదిలాబాద్, విశాలభారతి:**



వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, గ్రామంలో సుభిక్షం నెలకొనాలని ఆకాంక్షిస్తూ ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ మండలంలోని వర్తమన్నూర్ గ్రామాల్లో ఆదివారం గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా కప్పతల్లి ఆటలు నిర్వహించి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు చేశారు. ప్రకృతితో మమేకమైన ఈ ఆచారం గ్రామీణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తూ నేటికీ విశ్వాసంతో కొనసాగుతోంది. ఉదయం నుంచే మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కప్ప తల్లిని అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. "వానదేవా... కరుణించు", "పంటలు పండేలా వర్షాలు కురిపించు" అంటూ భక్తిగీతాలు పాడుతూ గ్రామమంతా తిరిగారు. ప్రతి ఇంటి ముందు గ్రామస్తులు నీళ్లు పోసి కప్పతల్లికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న వర్తమన్నూర్ గ్రామాల్లో ఇటీవల తగినంత వర్షపాతం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల్లో విత్తనాలు వేసిన రైతులు సకాలంలో వర్షాలు కురవాలని ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో మంచి వర్షాలు కురిసి పంటలు పుష్కలంగా పండాలని, చెరువులు, కుంటలు నిండాలని, భూగర్భ జలాలు పెరగాలని, పశువులకు తాగునీటి కొరత లేకుండా ఉండాలని గ్రామస్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం గ్రామ దేవతల ఆలయాల్లో పాలు, నీటితో జలాభిషేకాలు చేసి, కొబ్బరికాయలు కొట్టి, నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలో శాంతి, సుభిక్షం నెలకొని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలోని పెద్దలు, మహిళలు, యువత, చిన్నారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని సంప్రదాయాన్ని నిలబెట్టారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ, కప్పతల్లి ఆటలు నిర్వహిస్తే వర్ష దేవుడు ప్రసన్నమై సమృద్ధిగా వర్షాలు కురుస్తాయనే నమ్మకం పూర్వకాలం నుంచి కొనసాగుతోందని తెలిపారు. శాస్త్రీయంగా దీనికి ఆధారాలు లేకపోయినా, ప్రకృతిని ఆరాధించే గ్రామీణ జీవన విధానంలో ఈ సంప్రదాయానికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రకృతిపై ప్రేమను, సమాజంలో ఐక్యతను పెంపొందించే ఇలాంటి ఆచారాలు గ్రామీణ సంస్కృతి గొప్పతనాన్ని చాటుతున్నాయని పేర్కొన్నారు. ఆధునిక కాలంలోనూ పూర్వీకుల సంప్రదాయాలను మరువకుండా యువతరం సైతం ఈ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం. వర్షాలు కురిసి రైతుల కష్టాలు తీరాలని, పంటలు సమృద్ధిగా పండాలని గ్రామస్థులంతా ఏకస్వరంతో ప్రార్థించారు.వ్యవసాయంపై ఆధారపడిన గ్రామీణ జీవితంలో కప్పతల్లి ఆటలు కేవలం ఒక ఆచారం మాత్రమే కాదు, ప్రకృతిపై ఉన్న విశ్వాసానికి, రైతు ఆశలకు, గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలిచే జీవంతమైన సంప్రదాయం. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సిడం ప్రభాకర్, మాజీ సర్పంచులు వార్డ్ మెంబర్లు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## 5 ఏళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు



**మోటకొండూర్, విశాల భారతి:** మోటకొండూర్ మండలం అమ్మనబోలు గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పల్స్ పోలియో కార్యక్రమంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా వైద్య అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, గతంలో పోలియో చుక్కలు వేయించిన చిన్నారులకు కూడా ఈ ప్రత్యేక కార్యక్రమంలో తప్పనిసరిగా మరోసారి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చని, ఒక్క చిన్నారి కూడా మిగలకుండా తల్లిదండ్రులు సహకరించాలని వైద్య శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. అమ్మనబోలు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన పల్స్ పోలియో బూత్‌లో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమాన్ని వైద్య అధికారులు జయమ్మ, ఏఎన్ఎం ఉషారాణి, ఏఎన్ఎం, సంతోష్, ఆశా రేణుక, ఆశా సిద్ధమ్మ, అంగన్‌వాడీ టీచర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరసమ్మ, ఉప సర్పంచ్ కోల కృష్ణ, గ్రామస్తులు, తల్లిదండ్రులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు

**ఎలమంచిలి తండా సర్పంచ్ బానోతు భద్రు నాయక్**



**మరిపెడ, విశాల భారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఎలమంచిలి తండ గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బానోతు భద్రు నాయక్ మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి పోలియో రహిత సమాజ నిర్మాణానికి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.చిన్నారుల ఆరోగ్య పరిరక్షణలో పల్స్ పోలియో కార్యక్రమం కీలకమని, పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటును కాపాడాలి



**డోర్నకల్ విశాల భారతి:** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) తమ సమయాన్ని కేటాయించి ప్రతి ఓటును కాపాడేందుకు కృషి చేయాలని డోర్నకల్ నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇన్‌చార్జ్ పెండ్లి రఘువీర్ రెడ్డి పిలుపునిచ్చారు.ఆదివారం దంతాలపల్లి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలకు ఎస్ఐఆర్ అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ కోఆర్డినేటర్ అవిజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పెండ్లి రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి బీఎల్ఏ ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ఒక్క ఓటు కూడా జాబితా నుంచి తొలగించబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఓటును మ్యాపింగ్ చేయడంతో పాటు అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించాలని కోరారు.ఎస్ఐఆర్ పేరుతో కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, బీఎల్ఏలు అప్రమత్తంగా ఉండి ప్రతి ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటును కాపాడేందుకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో దంతాలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు నాయక్, నర్సింహులపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు జింకల రమేష్, యువ నాయకులు సతీష్, హరికృష్ణ, బీఎల్ఏలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మరిపెడలో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం

**వంద శాతం లక్ష్యానికి కృషి.. మున్సిపల్ చైర్ పర్సన్ ప్రగతి శ్రీపాల్ రెడ్డి**



**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగింది. మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 96 శాతం మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయించినట్లు ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.మున్సిపల్ ఛైర్‌పర్సన్ విశారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించగా, గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు. తొర్రూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాక్సినేషన్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ పూజిత, డాక్టర్ సౌజన్య, డాక్టర్ స్వామి, డాక్టర్ కిరణ్‌తో పాటు ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. వంద శాతం లక్ష్య సాధన కోసం మిగిలిన చిన్నారుల వివరాలను సేకరించి వారికి పోలియో చుక్కలు అందించే చర్యలు కొనసాగుతున్నాయని వైద్యాధికారులు తెలిపారు.

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

- గుండ్రాతిమడుగు పీహెచ్‌సీలో పల్స్ పోలియో కార్యక్రమం
- తన కుమారుడికి చుక్కలు వేయించి ఆదర్శంగా నిలిచిన కాంగ్రెస్ నాయకుడు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి

**కురవి విశాల భారతి:**



దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం గుండ్రాతిమడుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన తల్లిదండ్రులు తమ చిన్నారులను పెద్ద సంఖ్యలో తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల కాంగ్రెస్ నాయకుడు గార్లపాటి భరద్వాజ్ రెడ్డి తన కుమారుడికి స్వయంగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, పోలియో వంటి ప్రమాదకర వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలంటే ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని పిలుపునిచ్చారు. ప్రతి తల్లిదండ్రి ఈ కార్యక్రమాన్ని బాధ్యతగా భావించి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు వెంకటమ్మ, తిరుపతమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అలాగే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు పల్స్ పోలియో కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించి అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమానికి విశేషంగా స్పందించి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించారు. తన కుమారుడికి స్వయంగా పోలియో చుక్కలు వేయించి గార్లపాటి భరద్వాజ్ రెడ్డి ఇతర తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలిచారని పలువురు అభినందించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

## సర్ పత్రాలు బిఎల్ఓలే పంపిణీ చేయాలి

- ఎన్నికల నిబంధనలు పాటించని బిఎల్వోలు
- బిఆర్ఎస్ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ

**అశ్వాపురం, విశాలభారతి :**



కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్,ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్యూమరేషన్ (సర్) పత్రాలను బిఎల్వోలే పంపిణీ చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షుడు గద్దల రామకృష్ణ అన్నారు. అశ్వాపురం మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామపంచాయతీలలో కొందరు బిఎల్ఓలు అత్యుత్సాహంతతో అధికార పార్టీ నాయకులకు, అలాగే అధికార పార్టీకి అనుకూలమైన కుటుంబాల నుండి బిఎల్వోలుగా వారికి ఫారాలు ఇచ్చి పంపిణీ చేయిస్తున్నారన్నారు. బిఎల్ఏ లు స్థానికంగా ఉన్న అర్హులైన వారు ఓట్లు కోల్పోకుండా పారదర్శకంగా పనిచేయాల్సిన బూత్ స్థాయి అధికారి నూతన ఓటర్లను చేర్పించేందుకు విశిష్టమైన కృషి చేయాలన్నారు. అటువంటి ప్రక్రియను బిఎల్ఓ ప్రమేయం లేకుండానే రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఏ విధంగా ఓటర్లకు సర్ పత్రాలను పంచుతారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సంఘ నియమాలను పాటించకుండా బి ఎల్ వో లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. బూత్ లెవెల్ అధికారి పనులలో రాజకీయ పార్టీలకు చెందిన వారు ప్రవేశిస్తే నూతన ఓటరు జాబితా మార్పులు చేర్పుల ప్రక్రియలో అవకతవకలు జరిగే ప్రమాదం ఉందన్నారు. తద్వారా అధికార పార్టీ కి అనుకూలమైన వారికి మేలు చేకూరే అవకాశం కూడా లేకపోలేదన్నారు. బిఎల్వోలే స్వయంగా ఓటర్ల దగ్గరికి వెళ్లి సంబంధిత పత్రాలను అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే బిఎల్వోలు రాజకీయ పార్టీల వారు ఏర్పాటు చేసుకున్న బిఎల్ఏలకు ఇచ్చిన ఫారంలను స్వాధీనపరుచుకోవాలన్నారు. ఒకవేళ బిఎల్ఏలు పత్రాలు పంపిణీ చేసుకున్నప్పటికీ వాటిని బిఎల్వోల పర్యవేక్షణలో మాత్రమే ఓటరుకు పంపిణీ చేయాలన్నారు. సర్ కార్యక్రమంపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సాధించి నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నారు.

## బీఆర్ఎస్ పేరుతో ప్రచారం చేయడం సిగ్గుచేటు

**ఎలుగల నరేందర్**

**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు పట్టణ ప్రజలకు శ్రీ దుర్గామాత 11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో గుడి ముందు రహదారిని చదును చేసే కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టామని 1వ వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు ఎలుగల నరేందర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు సిమెంట్ దానం చేయడంతో పాటు శ్రమదానం చేసి రహదారిని సరిచేశారని ఆయన పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ నాయకులు చేసిన పనిని బీఆర్ఎస్ కౌన్సిలర్లు చేసినట్లుగా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే చర్య అని విమర్శించారు. అదేవిధంగా, ఈ అంశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు, ఆలేరు మున్సిపల్ చైర్మన్‌ను సమర్థిస్తూ ప్రచారం చేయడం సిగ్గుమాలిన చర్య అని ఎలుగల నరేందర్ ఆరోపించారు. ప్రజలకు సేవ చేసిన వారికి గుర్తింపు ఇవ్వాలని, రాజకీయ ప్రయోజనాల కోసం ఇతరులు చేసిన పనులకు తమ పేరు చెప్పుకోవడం మానుకోవాలని ఆయన సూచించారు.



## వినియోగదారుల మన్ననలు పొందాలి

**ఆరాధ్య హోటల్ ప్రారంభ.. 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్**





**చౌటుప్పల్, విశాలభారతి:** ఆహార పదార్థాల విషయంలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ.. వినియోగదారుల మన్ననలు పొందాలని కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం 13వ వార్డు పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరాధ్య హోటల్ ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా బత్తుల వాణి విప్లవ కుమార్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను వినియోగదారులకు అందించాలని సూచించారు. ఆహార పదార్థాల తయారీలో శుభ్రత పాటించాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, స్వచ్ఛమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. హోటల్ యజమాని సతీష్ కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హోటల్ యజమాని సతీష్ స్థానిక కౌన్సిలర్ బత్తుల వాణీ విప్లవ్ కుమార్ ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్లు ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కొయ్యడ శేఖర్ గౌడ్, కోఆప్షన్ మెంబర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నాయకులు చెవగోని వెంకటేష్ గౌడ్, వర్కాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియోకు మద్దతుగా చిన్నారులకు చుక్కలు

- పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు
- నిరుపేద కుటుంబానికి 25 కేజీల బియ్యంతో ఆర్థిక సాయం



**కురవి విశాలభారతి:** పోలియో వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్స్ పోలియో కార్యక్రమంలో టీపీసీసీ డాక్టర్ వింగ్ రాష్ట్ర కార్యదర్శి డా. వీరన్న నాయక్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆదివారం కురవి మండలంలోని మోదుగులగూడెం గ్రామం, జుజూరు తండా గ్రామపంచాయతీ, అయ్యగారిపల్లి గ్రామ పంచాయతీలలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఆయన పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేయిస్తూ ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం మోదుగులగూడెం గ్రామంలో తన తండ్రి గోపా నాయక్ జ్ఞాపకార్థంగా ఎస్.కె. సైదులు కుటుంబానికి 25 కేజీల బియ్యాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అండగా ఉంటానని డా. వీరన్న నాయక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మోదుగులగూడెం సర్పంచ్ చింతమల్ల ప్రవీణ్ కుమార్, అయ్యగారిపల్లి సర్పంచ్ జక్కుల మాధవి నాగన్న, జుజూరు తండా సర్పంచ్ బానోత్ శిరీష, ఉపసర్పంచ్ దయ్యాల శ్రీధర్ గౌడ్, ఉపసర్పంచ్ ధారావత్ శరత్ కుమార్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మోదుగులగూడెం అధ్యక్షుడు కోడి రాములు, అయ్యగారిపల్లి అధ్యక్షుడు దొంగల జనార్దన్ రెడ్డి, ఏఎన్ఎం కుమారి దేవి, వార్డు సభ్యులు, ఆశా కార్యకర్తలు, యువ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు

## సర్‌పై బిఎల్ఏలకు అవగాహన కార్యక్రమం



**ఆర్మూర్, విశాలభారతి:** నందిపేట్ మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించే సర్ పై బి ఎల్ ఏ లకు అవగాహన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దూడ వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బోధన్ శాసనసభ్యులు ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, డి సిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, తాహెర్ బిన్ హందన్ హాజరవుతున్నారని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి కాంగ్రెస్ శ్రేణులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనలని కోరారు.

## గ్రామ గ్రామాన పల్స్ పోలియో కార్యక్రమం



**దేవరుప్పుల విశాల భారతి :** పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా దేవరుప్పుల మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో నివారణ చుక్కల కార్యక్రమాన్ని విజయవంతంగా గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్లతో నిర్వహించారు. గ్రామాల వారిగా ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, స్థానిక ప్రజలు, చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని, పోలియో నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రజలు విశేష స్పందన తెలుపడంతో మండల వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## నిండు జీవితానికి రెండు చుక్కలు



**ఆర్మూర్, విశాల భారతి:** నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో నందిపేట మండలం లోని ఉమ్మెడ గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని సర్పంచ్ జంగిలి భోజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రెండు రోజులు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కల మందును వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బర్రె ఆనంద్, పలకవర్గ సభ్యులు, ఉమ్మెడ ఆశ వర్కర్ కొండూరు మీనా, తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్



**ఆర్మూర్ ,విశాల భారతి:** నందిపేట మండలంలోని భా ద్గుణ గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో సర్పంచ్ చెలిమెల సప్న సుధన్ పాల్గొన్నారు. అనంతరం ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు గ్రామపంచాయతీ ఆవరణలో పోలియో చుక్కలను వేశారు. పోలియో రహిత తెలంగాణను నిర్మించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ముత్యాల శివకుమార్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రావణ్, ఆశ వర్కర్ రాధిక, అంగన్ వాడి టీచర్ సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## గాలి వారి గూడెంలో పల్స్ పోలియో చుక్కలు



**మరిపెడ, విశాల భారతి:** మరిపెడ మండలం లోని గాలి వారి గూడెం గ్రామంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ గుగులోత్ రవి నాయక్, గ్రామ సర్పంచ్ నారెడ్డి కవిత సుదర్శన్ రెడ్డి, ఉపసర్పంచ్ బల్లం ఎల్లయ్య, వార్డు సభ్యులు ఏడెల్లి వెంకన్న, రాజుల లింగయ్య, ఎల్లబోయిన అనితతో పాటు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఏజెన్సీలో మెరుగైన వైద్య సేవలు అందించాలి

- ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో వైద్య సిబ్బందిని నియమించాలి
- ప్రవేట్ హాస్పిటల్ కి వెళ్ళకుండా సంపూర్ణ వైద్యం అందించాలి
- వైద్య సిబ్బంది నిర్లక్ష్యం లేకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి
- ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపం చేసే సిబ్బందిని తక్షణమే తొలగించాలి
- ప్రభుత్వ డాక్టర్లు కేవలం డిస్క్రిప్షన్ కె పరిమితమయ్యారు
- ఏదైనా గట్టి వైద్యం అంటే సొంత క్లినిక్లకు రమ్మంటున్నారు.
- ప్రభుత్వ వైద్యం కట్టుదిట్టం చేయకపోతే పేదలకు తీరని నష్టం వాటిల్లుతుంది
- ఆదివాసి నేత కంగాల రమణకుమారి ఆగ్రహం



**భద్రాచలం , విశాల భారతి;**

ఏజెన్సీ ప్రాంతంలో మలేరియా డెంగ్యూ వంటి సీజన్ వ్యాధుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని మహాజన సమితి ఆదివాసి మహిళ రాష్ట్ర కన్వీనర్ కంగాల రమణకుమారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి మలేరియా డెంగ్యూ నిర్ధారణ కు అవసరమైన పరీక్ష కిట్లు, మందులు వైద్య సిబ్బం ది పూర్తి స్థాయిలో నియమించి అత్యవసరమైన వైద్య సేవలు ప్రజలకు సకాలంలో అందాల నీ ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యం పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ఏజెన్సీ ప్రాంతంలో వ్యాధుల నివారణ పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు. వంద పడకల ఏరియా హాస్పిటల్ పూర్తి స్థాయిలో వైద్యం అందించుటలో ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆమె దుయ్యబట్టారు. ఖాళీగా రూములు ఉన్నాయని ఆ రూములలో సంబంధిత వైద్యులను నియమించడంలో నిర్లక్ష్యం జరుగుతుందని ఆమె మండిపడ్డారు. ఉన్న కొద్దిపాటి సిబ్బంది ఫోన్లు చూసుకుంటూ కాలక్షేపంగా ఉంటున్నారని ఎవరైనా ఎమర్జెన్సీ కేసులు వస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పటం ఫోన్లు చూసుకుంటూ సంభాషణ చేయడం వంటివి తరచుగా జరుగుతున్నావని అధికారులు వచ్చిన ఇటువంటి వాటిపైన చర్యలు తీసుకోక పో వడం దారుణమని ఆమె ఉద్ఘాటించారు. ఉన్న ఒక్క రక్త పరీక్ష కేంద్రంలో అనుభవం లేని సిబ్బంది ఉన్నారని ట్రైనింగ్ పిల్లలతో రక్తం తీపించడం వారికి సరిగ్గా రాకపోవడం పేషెంట్ కి బాధని కలిగించే విధంగా చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. సంపూర్ణ వైద్యం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో అందట్లేదని ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉన్న డాక్టర్లు సొంత క్లినిక్ లకు పరిమితమవుతున్నారని కేవలం మందులు రాసేందుకే ప్రాధాన్యత ఇస్తున్నారని వాళ్లు రాసిన కొన్ని మందులు దొరకకపోవడం బాధాకరమని ఆమె తెలిపారు. అంతేకాకుండా గట్టి వైద్యం చేయాల్సి వస్తే ఇక్కడ వైద్యం దొరకదు మా క్లినిక్ లోకి రండి అని బహిర్గతంగానే చెప్పి పేషెంట్లను వారి సొంత క్లినిక్ లకు తరలిస్తున్నారని ఆమె ఆవేదన చెందారు. ప్రభుత్వ వైద్యం కట్టుదిట్టమైన చర్యతో చేపట్టాలని తూతూ మంత్రంగా చేసి పేద ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని ఆమె హెచ్చరించారు. ప్రవేట్ హాస్పిటల్లో లక్షల కొద్ది డబ్బులు అప్పులు చేసి మరి వైద్యం చేయించుకుంటున్నారని వారి కన్నీటి గోష వర్ణాతితమని ఆమె వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ లో పూర్తిస్థాయిలో గదులను ఉపయోగించాలని కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుబాటులోకి తెచ్చి ఈ ప్రాంత ప్రజల ప్రాణాలను నిలబెట్టాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పల్స్ పోలియో చుక్కలు వేస్తున్న కార్పొరేటర్ రాంబాబు



**పాల్వంచ విశాలభారతి:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ 32వ డివిజన్ నవభారత్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని బిఆరెస్ కార్పొరేటర్ గుగులోత్ రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమం సందర్భంగా పోలియో టీకాలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేటర్ రాంబాబు తన సొంత ఖర్చుతో టెంటు, కుర్చీలు, తాగునీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించి వారి ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎ ఎన్ ఎం సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త జమునతో పాటు స్థానిక బిఆరెస్ నాయకులు నవభారత్ ఆనంద్, గాజుల కిరణ్, దేశినేని సంతోష్, భూక్య సాయికృష్ణ, మోహన్ తదితరులు పాల్గొన్నారు. అధికారులు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు సహకరించాలని కోరారు.

## గొల్లగూడెంలో ఎస్ఐఆర్‌పై ఓటర్లకు అవగాహన



**విశాలభారతి:** కరకగూడెం మండలం గొల్లగూడెం గ్రామంలో ఆదివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహించారు. విజిటింగ్ సూపర్‌వైజర్ కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీఎల్‌వో విజయ్, బీఎల్ఏ రంజిత్ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ఓటర్లు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారి ఆరోగ్యమే దేశ భవిష్యత్తు

**సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్**



**విశాలభారతి:** కరకాగూడెం జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు అభివృద్ధి ప్రదాత పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కరకగూడెం మండలం కరకగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్న మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ మరియు సర్పంచ్ పోలేబోయిన సుజాత. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోలియో రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని" కోరారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం ప్రతి చిన్నారి ఆరోగ్య రక్షణకు ఎంతో కీలకమని, ప్రభుత్వ ఆరోగ్య శాఖ చేపడుతున్న ఈ మహత్తర కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు,నాయకులు కార్యకర్తలు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై చర్యలు ఏవీ?

**BRS మండల నాయకులు కాపుల సూరిబాబు**




**భద్రాచలం , విశాల భారతి;** స్థానిక చర్ల రోడ్ , కొర్రాజులగుట్ట సెంటర్ లో యధేచ్ఛగా మూడంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం జరుగుతూ ఉన్నది గతంలో పంచాయితీ ఈఓ హడావిడిగా బిల్డింగ్ ను కట్టకుండా ఆపేశారు కానీ తరువాత మళ్ళీ ఏమైందో తెలియదు యధేచ్ఛగా నిర్మాణం కొనసాగుతూనే ఉంది అంతే కాదు గత 6 నెలలు గా చుట్టుపక్కల వారి ఇళ్లలోకి నీళ్లు సిమెంట్ పడుతూ ఉన్న అధికారులుకు మరియు ఇంటి ఓనర్ కి తెలియజేసిన కూడా ఎవరు కూడా పట్టించుకోకుండా కాలం గడుపుతున్నారు అంతే కాకుండా నిర్లక్ష్య సమాధానం చెప్తున్నట్టు తెలుస్తుంది సదరు యజమాని దగ్గర పర్మిషన్ ఉన్నదో లేదో అధికారులకే తెలియాలి ఏజెన్సీ చట్టాన్ని పూర్తిగా గాలికి వదిలేసిన వైనం భద్రాచలంలో ఉన్నది తక్షణమే అధికారులు స్పందించి ఇలాంటి కట్టడాలపై చర్యలు తీసుకోవాలని బి ఆర్ ఎస్ మండల నాయకులు కాపుల సూరిబాబు అధికారులను డిమాండ్ చేశారు. లేనిచో బి ఆర్ ఎస్ పార్టీ తరుపున వీటిపై పోరాడతామని తెలియజేసారు.

## స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎన్.ఐ.ఎస్ కోచ్‌గా ఉప్పుశెట్టి రాకేష్




**పాల్వంచ విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలానికి చెందిన ఉప్పుశెట్టి రాకేష్ ప్రతిభకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలానికి చెందిన ఉప్పుశెట్టి రాకేష్ గత మూడు సంవత్సరాలుగా బాస్కెట్‌బాల్ కోచ్‌గా సేవలందిస్తూ, బెంగళూరు లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (SAI) నేతాజీ సుభాస్ సదరన్ సెంటర్లో డిసెంబర్ 2025 నుండి జనవరి 2026 వరకు నిర్వహించిన ఎన్.ఐ.ఎస్ (బాస్కెట్‌బాల్) కోర్సును విజయవంతంగా పూర్తి చేసి అధికారికంగా ఎన్.ఐ.ఎస్ సర్టిఫికేషన్ పొందారు. ఈ ప్రతిష్టాత్మక కోర్సు ద్వారా ఆధునిక కోచింగ్ విధానాలు, క్రీడా విజ్ఞానం, ఆటగాళ్ల నైపుణ్యాభివృద్ధి మరియు శారీరక దృఢత్వానికి సంబంధించిన అంశాల్లో ప్రత్యేక శిక్షణ పొందారు. ప్రస్తుతం ఆయన విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు, బాస్కెట్‌బాల్ ఆట అభివృద్ధికి మరియు యువ క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు విశేషంగా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా క్రీడా రంగానికి చెందిన పలువురు ప్రముఖులు, సహచరులు మరియు క్రీడాభిమానులు ఉప్పుశెట్టి రాకేష్‌ను అభినందించారు. ఆయన సాధించిన ఈ ఘనత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని ప్రతిభావంతులైన క్రీడాకారులను తీర్చిదిద్ది జిల్లా, రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

## ఆంజనేయ స్వామి అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురవాలి – హరీష్ రావు

**నంగునూర్‌లో భక్తాంజనేయ స్వామి పునః ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ మంత్రి**



**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :** ఆంజనేయ స్వామి అనుగ్రహంతో ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా నంగునూర్ మండల కేంద్రంలోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన విగ్రహ పునః ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, ఈ ఏడాది కరువు పరిస్థితులు ఉంటాయని చెబుతున్న నేపథ్యంలో ఆంజనేయ స్వామి కటాక్షంతో ఆ పరిస్థితులు తొలగిపోయి రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురవాలని ప్రార్థించారు. రైతుల పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఎన్నో ఏళ్ల చరిత్ర కలిగిన భక్తాంజనేయ స్వామి దేవాలయంలో పునః ప్రతిష్ఠా కార్యక్రమం జరగడం ఆనందదాయకమని అన్నారు. ఈ మహోత్సవం భక్తుల్లో మరింత ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తుందని, ఆలయం మరింత వైభవంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. స్వామి ఆశీస్సులతో నంగునూర్ ప్రాంతం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజలంతా ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తాంజనేయ స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

## నిరుద్యోగ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**ఉద్యమ గాయకుడు పేరుమాండ్ల శ్రీనివాస్.**



**విశాలభారతి:** గూడూరు శ్రీ లక్ష్మీనారాయణ దేవాలయం నందు తెలంగాణ ఉద్యమం నిరుద్యోగ కళాకారుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది ఇట్టి సమావేశంలో తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ గాయకుడు పెరుమాండ్ల శ్రీనివాస్, మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కళాకారుల తమ ఆటపాటల ద్వారా ప్రజలను ప్రత్యేక రాష్ట్రం ఉద్యమం వైపు నడిపించి ముందు వరుసలో నిలిచిన కళాకారులకు మరియు వృత్తి కళాకారులకు సాంస్కృతిక సారధిలో మరియు ఉద్యోగ ఉపాధి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ఇందిరమ్మ ఇండ్లు వృధా కళాకారులకు పెన్షన్ డి పి ఆర్ ఓ ద్వారా నెలలో 20 రోజులు కళాకారులకు పని కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువేసే దిశగా వారి కళ నైపుణ్యాన్ని ప్రదర్శించే విధంగా అవకాశం కల్పించి నిరుద్యోగ ఉద్యమ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాకారులు జన్ను సారయ్య. బుర్ర శ్రీనివాస్. బట్టు సురేందర్. మెరుగు మహేష్. మెరుగు భద్రయ్య. మేడ వెంకన్న. బోడ సాంబయ్య. వాసం వెంకన్న. బొక్కల యకస్వామి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సర్పంచ్



**విశాలభారతి, గూడూరు:** గూడూరు మండల పరిధిలోని చిరగుంట గ్రామపంచాయతీలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో సర్పంచ్ ఇరియా నాయక్ మాట్లాడుతూ చిన్నపిల్లలు పోలియో పక్షవాతం వంటి భయంకరమైన వ్యాధుల నుండి విముక్తి పొందడానికి భారతదేశం ప్రతి సంవత్సరం పోలియో కార్యక్రమాన్ని నిర్వహించి పోలియో రహిత దేశంగా ఉండాలని కోరుకుంటున్నానని ఈ సందర్భంగా సర్పంచ్ ఈర్య నాయక్ మాట్లాడడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆ షవర్కర్ అంగన్వాడి టీచర్ ఆయమ్మ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## పల్స్ పోలియో కేంద్రాలను ప్రారంభించిన సర్పంచ్



**విశాలభారతి, గూడూరు:** ఆదివారం గూడూరు గ్రామపంచాయతీ పరిధి సమీపంలోని పోలియో బూత్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, మరియు ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో పోలియో చుక్కలు పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించగా అట్టి కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా గూడూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్మాలు నాయక్ పాల్గొని మాట్లాడుతూ పోలియో చుక్కలు (పల్స్ పోలియో)*అనేది చిన్నారులను పోలియో (పక్షవాతం) మహమ్మారి నుండి రక్షించే అత్యంత సురక్షితమైన మరియు అవసరమైన నోటి టీకా. భారతదేశాన్ని పోలియో రహిత దేశంగా ఉంచడానికి ప్రభుత్వం ప్రతి ఏటా ఈ జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తుంది. అని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న. గూడూరు ఉపసర్పంచ్ చంటి స్వామి. హాస్పిటల్ డాక్టర్ ఏఎన్ఎమ్‌లు అంగన్వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్. ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో ప్రతి బిడ్డకు రక్షణ కవచం

**చైర్పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్**



**చౌటుప్పల్ విశాలభారతి:** మండలంలోని బస్టాండ్ ఆవరణలో మరియు ప్రభుత్వ ఆసుపత్రిలో పల్స్ పోలియో కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని చిన్నారులకి పోలియో చుక్కలు వేసి కార్యక్రమం ప్రారంభించారు.అనంతరం చైర్పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, తల్లిదండ్రులు తమ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పాక చిరంజీవి, చింతల ఉమామహేశ్వరి సాయిలు, ఎండి హను బాయ్, బత్తుల జయమ్మ దాస్,వైద్యాధికారులు సుమన్ కళ్యాణ్, కాటమరాజు పాండురంగారావు, వైద్య సిబ్బంది,ఆశ వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట బోనాలు

**భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు**



**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలం మున్సిపాలిటీ పరిధిలోని దేశ్య తండాలో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా శనివారం భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలను తలపై మోసుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. గ్రామంలో భక్తి శ్రద్ధల మధ్య బోనాల ఊరేగింపు నిర్వహించగా, భక్తులు ప్రత్యేక పూజలు, హారతులు సమర్పించారు.గ్రామంలో సుఖశాంతులు, పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బంగారు భవిష్యత్తుకు రెండు చుక్కలు

- వెంకంపాడులో పల్స్ పోలియోకు విశేష స్పందన
- సర్పంచ్ ఉప్పల సోమన్న ఆధ్వర్యంలో ఘనంగా పల్స్ పోలియో కార్యక్రమం



**మరిపెడ, విశాల భారతి:**

భవిష్యత్ తరాలను పోలియో మహమ్మారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమానికి వెంకంపాడు గ్రామంలో విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ ఉప్పల సోమన్న ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని పోలియో కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఉదయం నుంచే గ్రామంలోని తల్లిదండ్రులు తమ ఐదేళ్లలోపు చిన్నారులను పోలియో కేంద్రానికి తీసుకువచ్చి చుక్కలు వేయించడంతో కేంద్రం సందడిగా మారింది. సర్పంచ్ ఉప్పల సోమన్న స్వయంగా కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "పిల్లల ఆరోగ్యమే దేశ భవిష్యత్తు. ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రి బాధ్యత. ఒక్క చిన్నారి కూడా మిగలకుండా అందరికీ పోలియో చుక్కలు వేయించాలి" అని పిలుపునిచ్చారు. ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది గ్రామంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి తల్లిదండ్రులను చైతన్యపరిచారు. అవసరమైతే ఇంటింటికీ వెళ్లి పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల చొరవతో వెంకంపాడులో పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగిందని ఆరోగ్య శాఖ అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు బీమా కల్పించడం

**విశాలభారతి, కామారెడ్డి**



రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖలలో, కార్పొరేషన్లు, సొసైటీలలో, స్థానిక సంస్థలలో పనిచేస్తున్న అవుట్సోర్సింగ్ ఉద్యోగులకు బీమా పథకాన్ని వర్తింపచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఉప అధ్యక్షుడు అరుణ్ కుమార్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న వేలాది మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు 60 లక్షల వరకు భీమా రక్షణ లభించనుండడం వారి కుటుంబాలకు భరోసానిస్తుందని పేర్కొన్నారు. ఉద్యోగి ఏదైనా అనుకోని ప్రమాదానికి గురైన సమయంలో కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత కల్పించి ఈ పథకం సామాజిక భద్రతకు నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు.జేఏసీ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులు కీలక పాత్ర పోషించినప్పటికీ గతంలో అనేక సంక్షేమ పథకాలకు దూరంగా ఉండేవారని ప్రస్తుతం ప్రభుత్వం వారిని బీమా పరిధిలోకి తీసుకురావడం అభినందనీయమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువేయడంలో కార్యాలయ వేలకు మించి ఎక్కువ సమయం కేటాయిస్తూ పని పరంగా ప్రతి ఒక్క ఔట్సోర్సింగ్ ఉద్యోగి గ్రామస్థాయి నుండి జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. కావున తక్షణమే ప్రభుత్వం ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పే స్కేల్ ఇవ్వాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీమా పథకంపై ఇది గొప్ప సామాజిక భద్రత చర్య అని జేఏసీ కమిటీ సభ్యులు కొనియాడారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,పలు శాఖల మంత్రులకు, ప్రభుత్వ సలహాదారులకు, ఎమ్మెల్యేలకు,రాష్ట్ర,జిల్లా స్థాయి అధికారులకు రాష్ట్ర జేఏసీ ఉప అధ్యక్షుడు అరుణ్ కుమార్ జిల్లా అధ్యక్షుడు అల్లావుద్దీన్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, జిల్లా కోశాధికారి రాజేందర్, జేఏసీ జిల్లా సలహాదారులు రాజ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఇమ్రాన్, పద్మ ,అనసూయ, జగన్ విక్రమ్ మునీర్ నాగేష్ నవీన్ అంజయ్య, కన్నయ్య హరీష అనిత పరమేశ్వరి, దేవేందర్, సాయిబాబా, వినోద్ క్రాంతి శ్రీనివాస్ ఉన్నారు.

## కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టండి..!

**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :**

సిద్దిపేట జిల్లాలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో విచ్చలవిడిగా చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థి,ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని టీటీసీ భవన్ లో పీ.డీ.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి రమేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ సిద్దిపేటలోనీ ప్రైవేటు పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని అన్నారు. విద్యాహక్కు చట్టానికి విఘాతం కలిగించి ప్రభుత్వ పాఠశాలల పక్కనే ప్రైవేటు పాఠశాలలను నెలకొల్పుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సీబీఎస్ఈ, ఐఐటీ సిలబస్ పేర్లతో అబద్ధపు ప్రచారాలు చేస్తూ అక్రమ అడ్మిషన్లు చేస్తున్నారని దుయ్యబట్టారు. సిద్దిపేట జిల్లాలో శ్రీచైతన్య,నారాయణ, రాక్ వుడ్ లాంటి అనేక పాఠశాలలు విద్యను వ్యాపార సరుకుగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పాఠశాలలలో పేద విద్యార్థులకు 25% ఉచిత అడ్మిషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా అనేక పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లోనే పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, టై బెల్టు బూట్లు తదితర వస్తువులను అమ్ముతున్నారనీ ఇట్టి పాఠశాలలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అన్ని విద్యార్థి సంఘాలను మరియు విద్యార్థుల తల్లిదండ్రులను కలుపుకొని అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల ఎదుట ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిటీఫ్ రాష్ట్ర అదనపు అధ్యక్షులు జి.తిరుపతి రెడ్డి, పీ.డీ.ఎస్.యు జాతీయ సమన్వయ కమిటీ సభ్యులు ఎస్.వి.శ్రీకాంత్, కెఎన్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరం అభినవ్ మరియు బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నవీన్ గౌడ్, ఎస్సీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆస లక్ష్మణ్, డిటిఎఫ్ జిల్లా బాధ్యులు బాకీ చంద్ర భాను, పౌర హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్, సామాజిక ఉద్యమ నాయకులు సుకూరి ప్రవీణ్ తదితరులు హాజరై మాట్లాడారు.



# రూట్ మార్చిన నేషనల్ క్రష్

గ్లామరస్, ఎమోషనల్ క్యారెక్టర్స్ లలో ఒదిగిపోయి...ఆ కోణంలో తన కెరీర్ ను మలచుకున్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఇప్పుడు తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇప్పుడు ఆమె చేస్తున్న చిత్రాల్లోని పాత్రల స్వభావం, తీరు తెన్నులే అందుకు ఉదాహరణ. విజయ్ దేవరకొండతో వివాహానంతరం కూడా ఆమె తన కెరీర్ ను కొనసాగించేందుకే నిర్ణయించుకున్న విషయం వేరుగా చెప్పనక్కర లేదు. ఒకటి కాదు రెండు కాదు..ఆమె చేతిలో ప్రస్తుతం మూడు భారీ అంచనాలు కలిగిన సినిమాలు ఉన్నాయి. మహిళా ప్రధానమైన పాన్-ఇండియా ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ 'మైసా' చిత్రంలో ఒక పరాక్రమవంతమైన గిరిజన అమ్మాయిగా కనిపించబోతున్నారు. ఇందులో ఆమె రిస్కీ ఫైట్స్ సీన్స్ కూడా చేస్తున్నారు. ఇక విజయ్ దేవరకొండ పాన్ ఇండియా చిత్రం 'రణబాలి'లో జయమ్మ అనే పాత్రలో ఆమె నటిస్తున్నారు. స్వాతంత్రం రాక ముందు జరిగిన కొన్ని నిజ జీవిత సంఘటనల ఆధారంగా పీరియాడిక్ బ్యాక్ డ్రాప్ తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ రెండు సినిమాల్లోనూ గ్లామర్ కు ప్రాధాన్యం లేని, అభినయానికి ఎక్కువ అవకాశం విభిన్నమైన పాత్రలలో రష్మిక నటిస్తున్నారు. ఇదిలావుండగా...అల్లు అర్జున్ హీరోగా అట్లీ దర్శకత్వంలో రాబోతున్న 'రాకా' చిత్రంలో రష్మిక ఒక నెగటివ్ షేడ్స్ (ప్రతికూల లక్షణాలు) ఉన్న పాత్రలో కనిపించనున్నట్లు పరిశ్రమలో వినిపిస్తోంది. ఈ వారంలో అల్లు అర్జున్‌తో కలిసి ఆమె ఈ సినిమా షూటింగ్ షెడ్యూల్‌లో పాల్గొంటారని భావిస్తున్నారు. ఇప్పుడు రష్మిక ఈ సినిమాలో పోషిస్తున్న ప్రత్యేక పాత్రే చర్చనీయాంశంగా మారింది. దర్శకుడు అట్లీ ఊహించని మలుపులతో రష్మిక పాత్రను తీర్చిదిద్దారని సమాచారం. చిత్ర బృందం మాత్రం దీనిపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడించనప్పటికీ...ఆమె తన కెరీర్‌లో ఇప్పటివరకు పోషించని ఒక డార్క్ షేడ్స్, లోతైన భావోద్వేగాలు కలిగిన పాత్రలో కనిపించనున్నట్లు తెలిసింది. అల్లు అర్జున్-రష్మిక జోడీ ఇప్పటికే 'పుష్ప' మరియు 'పుష్ప 2' చిత్రాలతో రెండు భారీ విజయాలను అందుకుంది. అయితే, ఈసారి వారు కేవలం ప్రేమ జంటగా కాకుండా తెరపై భిన్నమైన పాత్రలతో సందడి చేస్తారని వినిపిస్తున్న మాటలలో వాస్తవాలు ఏంటి? అన్నది చిత్రబృందం చెప్పేదాకా వేచి చూడాల్సిందే.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.